# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 235 | VEKUVA SAMAYAM TELUGU DAILY | తేది: బుధవారం 30 సెప్టెంబర్ 2026

* Mahabubnagar * Hyderabad * Miryalaguda & Rangareddy సంపాదకులు : కె.భాస్కర్‌రావు రూ.2.00/- పేజీలు





కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై కాంగ్రెస్ అధ్యక్షుడు తీవ్ర విమర్శలు గుప్పించారు. ఓటర్ల జాబితా సవరణ, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత అంశాలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ ప్రధాని మోదీ చేతిలో కీలుబొమ్మగా మారిపోయారని ఆరోపించారు. తాజాగా జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై ఖర్గే నిప్పులు చెరిగారు.

**సమయం ప్రతినిధి :** జ్ఞానేశ్ కుమార్ కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఖర్గే ఆరోపించారు. జ్ఞానేశ్‌ను ప్రధాన ఎన్నికల కమిషనర్ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపులో కుట్ర జరుగుతోందని, ఎన్నికల కమిషన్ పనితీరుపై తీవ్ర సందేహాలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. సీడబ్ల్యూసీ సమావేశంలో ఖర్గే ఓటర్ల జాబితా, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతకు సంబంధించి ఐదు ప్రధాన డిమాండ్లను వెల్లడించారు. ఓటర్ల జాబితాలో చేసిన ముఖ్యమైన మార్పులు, తొలగింపులు, చేర్పులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని బహిరంగం చేయాలని కాంగ్రెస్ కోరింది. ఓటర్ల జాబితా నుంచి పేరు తొలగించిన వ్యక్తులకు పూర్తి సమాచారం అందించి, నిర్ణయాన్ని సవాలు చేసేందుకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేసింది. సకాలంలో అందించాలని కోరింది.




ఆసియా క్రీడలు-2026లో భారత అథ్లెటిక్స్ జట్టు ఎట్టకేలకు స్వర్ణ పతకం సాధించింది. మహిళల 4x400 మీటర్ల రిలేలో కిరణ్ పహల్, ఎం.ఆర్. పూవమ్మ, ప్రాచి, విథ్యా రామ్‌రాజ్‌తో కూడిన భారత బృందం అద్భుత ప్రదర్శనతో పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది.

**సమయం ప్రతినిధి :** మంగళవారం జరిగిన ఫైనల్లో భారత్ 3:29.69 నిమిషాల్లో రేసును పూర్తి చేసి అగ్రస్థానంలో నిలిచింది (India athletics gold). రేసులో భారత్‌కు చివరి ల్యాప్ అత్యంత కీలకంగా మారింది. చివరి దశలో బహ్రెయిన్ నుంచి సల్వా ఈద్ నాసర్ గట్టి పోటీ ఇచ్చింది. అయితే యాంకర్‌గా బరిలోకి దిగిన విథ్యా రామ్‌రాజ్ ఒత్తిడిని అధిగమించి భారత్‌ను విజయతీరాలకు చేర్చింది. దీంతో భారత బృందం స్వర్ణ పతకాన్ని ఖాయం చేసుకుంది. భారత్ 3:29.69 నిమిషాల్లో రేసు పూర్తి చేయగా.. బహ్రెయిన్ 3:30.21తో రజతం, చైనా 3:31.02తో కాంస్యం సాధించాయి. బహ్రెయిన్‌పై భారత్ 0.52 సెకన్ల ఆధిక్యంతో గెలిచింది (4x400m relay, womenμs relay).
2026 ఆసియా క్రీడల్లో భారత అథ్లెటిక్స్ బృందానికి మహిళల 4ఇ400 మీటర్ల రిలే స్వర్ణం ప్రత్యేకంగా నిలిచింది. ఈ విజయం ద్వారా ఈ క్రీడల్లో అథ్లెటిక్స్ విభాగంలో భారత్ తొలి స్వర్ణ పతకాన్ని అందుకుంది. విథ్యా రామ్‌రాజ్ (Vithya Ramraj)కు నాగోయా ఏషియన్ గేమ్స్‌లో ఇది మరో పతకం. అంతకుముందు మహిళల 400 మీటర్ల హర్డిల్స్‌లో ఆమె కాంస్య పతకం సాధించింది. ఆ రేసులో 54.75 సెకన్ల వ్యక్తిగత అత్యుత్తమ సమయంతో పరుగెత్తి పి.టీ. ఉష పేరిట 42 ఏళ్లుగా ఉన్న జాతీయ రికార్డును బద్దలు కొట్టింది.




**హైదరాబాద్, సెప్టెంబర్ 29, సమయం ప్రతినిధి:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఉద్దేశించి తెలంగాణ రక్షణసేన అధ్యక్షురాలు(టీఆర్ఎస్) కవిత తీవ్ర స్థాయిలో వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ తీరుపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ పలు ప్రశ్నలు సంధించారు. తాను బీఆర్ఎస్ పార్టీలోని ఓ వ్యక్తిని విమర్శించినందుకే తనను కొన్ని గంటల్లోనే పార్టీ నుంచి సస్పెండ్ చేశారని అన్నారు. ఇప్పుడు తాను విమర్శించిన వ్యక్తితో అంటకాగుతూ.. పార్టీ అధినేత తీరుతోనే నష్టపోయామని బహిరంగంగా వ్యాఖ్యలు చేయడం పార్టీ వ్యతిరేకం కాదా అని కేటీఆర్‌ను ప్రశ్నించారు. 'మీరు మీ పార్టీ అధినేత కేటీఆర్‌ను విమర్శించడం.. ఆయన తీసుకున్న విధానపరమైన నిర్ణయాలను బాహాటంగా తప్పుపట్టడం పార్టీ వ్యతిరేక చర్య కాదా? మీ ఫాంహౌస్‌లు, అక్రమంగా ఇచ్చిన పర్మిషన్లు.. ఆంధ్రా దోస్తులకు ఇచ్చిన నజరానాలు.. క్విడ్ ప్రోకో దందాలతో మీ పార్టీని పాతాళంలోకి నెట్టింది మీరు కాదా?' అని కవిత నిలదీశారు. నిన్నటి బీఆర్ఎస్ మీటింగ్‌లో ఓ రైతు ఫోన్ మాట్లాడుతుంటే 'నీ పెండ్లామా!? అంత అర్జెంటా!?' అని అహంకారంతో అతని భార్యనే అవమానించారని మండిపడ్డారు. అలాగే ఓ మహిళా సాయం కోరి వస్తే 'నా కోసం కన్నావా' అని అమ్మనే అవమానించారని ఆరోపించారు. 'గుంటనక్క MIND GAME ýBLIND గా పడిపోయి పెద్ద మనిషినే తప్పు బడుతున్నావ్.. బీఆర్ఎస్‌కు గోతిని తవ్వుతున్నావ్' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'కూర్చున్న కొమ్మనే నరుక్కున్నట్టు.. పార్టీలో మీ వైఫల్యాన్ని.. మీ చేతగానితనాన్ని బీఆర్ఎస్ అధినేతపై మోపుతున్నావు అంటే... ప్రత్యక్ష రాజకీయాల్లో మీ స్థానం ఏమిటో అర్థమవుతుందా? నిమజ్జనోత్సవంలో ఎంతమంది సోషల్ మీడియా influencers ను బతిమాలుకున్నారో ఆ గణేశ్ మహారాజుకు, మీ అంతరాత్మకు తెలుసు. నేను నీలాగా విష నాగుల మాటలు విని మాట్లాడను.. నిర్దిష్టమైన ఆధారాలతోనే మాట్లాడుతాను.. నాతో పెట్టుకోకు!' అంటూ కేటీఆర్‌ను ఉద్దేశించి ఎక్స్‌లో కవిత పోస్ట్ చేశారు.




**హైదరాబాద్, సెప్టెంబర్ 29, సమయం ప్రతినిధి:** సన్నబియ్యం ధరలు మార్కెట్లో దడ పుట్టిస్తున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో వానాకాలం సీజన్‌లో సన్నరకం ధాన్యం సాగు తగ్గడం, భవిష్యత్తులో ధాన్యం కొరత ఏర్పడనుందనే అంచనాలతో వ్యాపారులు ముందుగానే సన్న ధాన్యం నిల్వ చేసి పెడుతుండడంతో మార్కెట్లో ధరలు రోజురోజూకు పెరుగుతున్నాయి. ప్రస్తుతం ఆర్ఎన్ఆర్ వంటి సన్నరకం బియ్యం హోల్‌సెల్ ధర కిలోకు 74 నుంచి 85 రూపాయల వరకు పలుకుతోంది. ప్రస్తుతం ధాన్యం నిల్వలపై ని యంత్రణ లోపం, మిల్లర్ల సమస్యల కారణంతో పెరుగుతున్న బియ్యం ధర కొద్ది రోజుల్లోనే పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

**సన్న రకాల సాగు నిబంధన...**

ఎల్‌నినో ప్రభావంతో ఈసారి వానా కాలంలో ప్రభుత్వం సన్నరకాలే సాగు చేయాలని, అది కూడా ఏడు రకాలకే రాయితీ ఇస్తామని చెప్పినా రైతులు మాత్రం సన్న ధాన్యం సాగుకు అంతంత మాత్రం గానే ముందుకు వచ్చారు. కొద్దిగా సాగైన స న్నాలకు సైతం ఈ సారి కొత్త రకం చీడ పీడలు ఆశించి పంట దెబ్బతింటోంది. మరో 20 శాతం పొ లాలు నీటి ఎద్దడి, విద్యుత్తు కోతల కారణంగా దెబ్బతింటున్నాయి. ఈ కారణాలన్నీ పంట దిగు బడిపై ప్రభావం చూపుతున్నాయి.

**రేషన్ బియ్యానికి డిమాండ్**

రాష్ట్రప్రభుత్వం పేదలకు రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ ప్రా రంభించాక బహిరంగ మార్కెట్లో సన్నబియ్యం ధరలు తగ్గుముఖం పట్టాయి. నూకలు ఎక్కువగా వస్తుండడంతో దిగువ, మధ్య తరగతి ప్రజలు రేషన్ బియ్యం తినడం తగ్గించారు. ఈ బి య్యాన్ని దళారులకు విక్రయించి దుకాణాల్లో ఫైన్ క్వాలిటీ బియ్యం కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు.

## రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు

# అక్టోబర్ 1 నుంచి 163 కొనుగోలు కేంద్రాలు





**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 29, సమయం ప్రతినిధి:** వానాకాలం 2026--27 సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహించి రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు.

జిల్లాలో సుమారు 4.26 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేయగా, 1.53 లక్షల టన్నులు కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం 163 కొనుగోలు కేంద్రాలను అక్టోబర్ 1 నుంచి ప్రారంభించాలని సూచించారు.

కేంద్రాల్లో గన్నీ సంచులు, తూకం, తేమ పరీక్ష పరికరాలు, సిబ్బంది, తాగునీరు, నీడ తదితర వసతులు కల్పించాలని ఆదేశించారు. గ్రేడ్--ఏ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,461, సాధారణ రకానికి రూ.2,441 మద్దతు ధరగా ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఏడు సన్న రకాల ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందుతుందని పేర్కొన్నారు.

ధాన్యంలో తేమ 17 శాతానికి మించకుండా రైతులు ధాన్యాన్ని శుభ్రపరిచి, ఎండబెట్టి టోకెన్ ప్రకారం కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన మద్దతు ధరను 48 గంటల్లో రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.




**హైదరాబాద్, సెప్టెంబర్ 29, సమయం ప్రతినిధి:** గణేశ్ ఉత్సవాల సందర్భంగా మహిళలు, యువతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ఖైరతాబాద్, బాలాపూర్ గణేశ్ మండపాల వద్ద షీ టీమ్స్‌ను భారీగా మోహరించి ఈవ్‌టీ జింగ్‌కు పాల్పడే వారిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 14 నుంచి 26 వరకు నిర్వహించిన ప్రత్యేక తనిఖీలు, నిఘాలో 2,935 మంది ఆకతాయిలను షీ టీమ్స్ గుర్తించాయి. వీరిలో పలువురికి కౌన్సెలింగ్ ఇచ్చి హెచ్చరించగా.. మరికొందరిపై కేసులు నమోదు చేసి, శిక్షలు పడేలా చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఉత్సవాల వేళ మహిళలతో అనుచితంగా ప్రవర్తించిన 858 మందికి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం వారిని గట్టిగా హెచ్చరించి విడిచిపెట్టినట్లు పేర్కొన్నారు. అలాగే, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు గుర్తించిన వారిలో 69 మందికి శిక్ష విధించినట్లు వెల్లడించారు. ఇందులో 24 మందికి రూ.1,050 జరిమానా విధించగా.. మరో 40 మందికి సామాజిక సేవతో పాటు రూ.1,050 జరిమానా విధించినట్లు తెలిపారు. మరో ఐదుగురికి జరిమానాతో పాటు జైలు శిక్ష విధించినట్లు వివరించారు. పండుగల సమయంలో యువత భక్తిశ్రద్ధలతో ఉండాలని, అంతేకానీ మహిళలను వేధించడం సరికాదని పోలీసులు పేర్కొన్నారు. అలాంటి చర్యలకు పాల్పడే ఆకతాయిలను ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు.

# సంపాదకీయం

## పరీక్షలు: పొదల వెనక పులులు!

కొన్నేళ్లుగా, పదో తరగతి విద్యార్థులూ, ఇంటర్ విద్యార్థులూ, ఆఖరికి ఐఐటీ విద్యార్థులూ, ఆ చదువుల భారం మోయలేక, ముఖ్యంగా పరీక్షల ఒత్తిడిని తట్టుకోలేక, ప్రాణాలు తీసుకుంటున్న వార్తలు చూస్తున్నాం. 2014 నుంచి 2024 వరకు గత పదేళ్ల కాలంలోనే భారతదేశంలో 1 లక్షా, 23వేల కంటే ఎక్కువ మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయి. నిన్న మొన్న, బొంబాయి ఐఐటీలో ఒక విద్యార్థి, పరీక్ష హాల్లో కాపీ కొడుతూ పట్టుబడడం, తర్వాత ఆత్మహత్య చేసుకోవడం తెలిసిందే. ఈ సంఘటన విన్నాక, గతంలో, హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీలో టీచరుగా ఉన్నప్పుడు, పరీక్షల నిర్వహణకు సంబంధించి నా అనుభవాలు కొన్నిటిని చెప్పాలనిపించింది. నా సర్వీసులో, చివరి 7 సంవత్సరాలలో, 'సోషియాలజీ'లో నేను పరీక్షలు ఎలా నిర్వహించేవాణ్నో మాత్రమే చెపుతాను. నేను పాఠాలు చెప్పే ఆప్షనల్ కోర్సులకు, వేరు వేరు సబ్జెక్టులకు సంబంధించిన విద్యార్థులు ప్రతి సంవత్సరమూ, సగటున 80-90 మంది వచ్చేవారు. వాళ్లందరూ, ఇంటర్ పూర్తిచేసి, 5 సంవత్సరాల మాస్టర్స్ కోర్సుకు వచ్చినవాళ్లే. వాళ్లు రకరకాల రాష్ట్రాలనించీ, వేరువేరు కుటుంబాలనించీ, వచ్చినవాళ్లు. యూనివర్సిటీలో, వాళ్ల సంఖ్యలు నూటికి: ఎస్సీలు-15, ఎస్టీలు-8, ఓబీసీలు--27, ఓసీలు-50. వాళ్లలో దాదాపు సగం మంది ఇంగ్లీషు మీడియంలోనూ, మిగతా సగం ప్రాంతీయ భాషల మీడియంలలోనూ చదువుకున్నవారు. ఇంగ్లీషు మీడియం చదువుకున్న వారిలో కూడా, ఇంగ్లీషు అంతగా రానివారే ఎక్కువమంది. అందువల్ల, నేను సగం ఇంగ్లీషులోనూ, కొంత హిందీ-ఉర్దూలోనూ పాఠాలు చెప్పేవాణ్ని. యూనివర్సిటీ నిబంధనల ప్రకారం సోషియాలజీ పాఠాలూ, పరీక్షలూ ఇంగ్లీషులోనే జరగాలి. కానీ, నేను విద్యార్థుల పరిస్థితి అర్థం చేసుకుని, ఆ నిబంధనను పాటించలేదు. ప్రతి పాఠానికీ సంబంధించి, కొన్ని ముఖ్యమైన పాయింట్లను, నిర్వచనాల రూపంలోనూ, క్లుప్తమైన వివరణల రూపంలోనూ, నేనే టైప్ చేసి, యూనివర్సిటీ ఆఫీసు ద్వారా ప్రింటవుట్లు తీయించి, స్పైరల్ బైండింగు చేయించి, క్లాసులో ఎంతమంది వుంటే అంతమందికీ ఒక్కో హ్యాండవుట్ల పుస్తకం లైబ్రరీ వాళ్లు ఇచ్చే ఏర్పాటు చేశాను. పరీక్షా పత్రాలు ఇంగ్లీషులోనే ఉండేవి. పది ప్రశ్నలు ఇచ్చి, వాళ్లకు నచ్చిన 5 ప్రశ్నలకు జవాబులు రాయమనేవాణ్ని. ఆ పది ప్రశ్నలూ పదిరోజుల ముందే బహిరంగంగా అందరికీ ఇచ్చేసే వాణ్ని. జవాబులు, వీలైనంత వరకూ ఇంగ్లీషులోనే రాయమనేవాణ్ని. ఇంగ్లీషులో స్పెల్లింగు తప్పులూ, గ్రామరు తప్పులూ వున్నా, మార్కులు 'కట్' చెయ్యననే వాణ్ని. ఎందుకంటే, నాది ఇంగ్లీషు కోర్సు కాదు కాబట్టి. విషయం అర్థం అయిందా లేదా అనేది ముఖ్యం గానీ, ఇంగ్లీషు భాషా సామర్థ్యం ముఖ్యం కాదని చెప్పేవాణ్ని. పోనీ, సగం ఇంగ్లీషులో, సగం వారి భాషలో, రాయమనే వాణ్ని. అక్కడక్కడా, కొన్ని ప్రశ్నల జవాబులు కొందరు తెలుగులో గానీ, కొందరు హిందీలో గానీ రాసినప్పుడు, ఆ పేపర్ల విషయంలో నాకు ఇబ్బంది రాలేదు. ఆ భాషలు నాకు తెలుసు కాబట్టి. సగం ఇంగ్లీషులో, సగం ఉర్దూ లిపిలో కొద్దిమంది రాస్తే, వాటిని ఉర్దూ తెలిసిన వారితో చదివించుకుని పేపర్లు దిద్దేవాణ్ని. ఒక సెమిస్టరులో, రెండు ఇంటర్నల్ పరీక్షలకు 20 చొప్పున, రెండు 20లు, 40 మార్కులుండేవి. సెమిస్టర్ చివరి పరీక్షకు 60 మార్కులుండేవి. మొత్తం 100కి. ఇంటర్నల్ పరీక్షలకు కూడా, ఏ టాపిక్కుల్లోనైతే నేను ప్రశ్నలు అడుగుతానో, వాటిని కూడా ముందే ఇచ్చేవాణ్ని. ఒక ఇంటర్నల్ పరీక్షలో మాత్రం, నేను అడిగే ప్రశ్నలకు నోటి మాటలతో ('ఓరల్'గా) జవాబు చెప్పాలి. బట్టీ కొట్టినట్టు చెప్పకూడదు. కావాలంటే, నేను ఇచ్చిన లెక్చర్ నోట్స్ తెరిచి, చూసి, చదివి, దాని అర్థం చెప్పాలి.

**ఇలా సాగింది నా బోధనా, పరీక్షల నిర్వహణ.**

ఏ సంవత్సరంలోనూ విద్యార్థులు (కంటిచూపు లేని విద్యార్థులతో సహా) ఎవ్వరూ అభ్యంతరపెట్టలేదు. అసంతృప్తి చెందలేదు. ఒక్కసారి మాత్రం, ఒక కుర్రాడు, 5 ప్రశ్నలకూ, 5 చీటీలు తెచ్చుకుని, చూసి రాస్తున్నాడు. అది చూసి, "నువ్వు ఇలా చెయ్యడం చాలా తప్పు. నమ్మక ద్రోహం. నేను సిలబస్‌లో ప్రతి పాఠమూ వీలైనంత వివరంగానే చెప్పాను గదా? లెక్చర్ నోట్స్ కూడా ఇచ్చాను గదా? ముందుగానే ప్రశ్నలు కూడా ఇచ్చాను గదా? నువ్వు ఇలా చెయ్యడం నేను ఒప్పుకోను. నువ్వు నన్ను మోసం చేశావు. నువ్వు పరీక్ష రాయడం ఆపేసి, పేపరు ఇచ్చి వెళ్లిపో. నీకు మళ్లీ తర్వాత, సప్లిమెంటరీ పరీక్ష పెడతాను కావాలంటే" అని పంపించేశాను. అప్పుడా కుర్రాడు, నవ్వుకుంటూ, పేపరు ఇచ్చేసి వెళ్లిపోయాడు. ఏ అఘాయిత్యమూ చేసుకోలేదు. పోలీసు పరీక్షకు ప్రిపేర్ అవుతున్నానని చెప్పాడు అప్పట్లో. ఇది జరిగి దాదాపు పదిహేనేళ్ల పైనే అయింది. ఇప్పుడేమి చేస్తున్నాడో!అమలులో ఉన్న ఈ పరీక్షల పద్ధతికి, నేను ఎప్పట్నించో వ్యతిరేకం. వీలున్నచోటల్లా, దాన్ని అతిక్రమించాను. అది నేరం అనుకోవడం లేదు. నాకీ అభిప్రాయాలు కలగడానికి కారణం ఇద్దరు. ఒకటి, చలంగారు. రెండు మావో. వాళ్లిద్దరి మాటలూ చెప్పి ముగిస్తాను."కుర్రాళ్లు పరీక్షలు రాస్తూ వుంటే, కావలి కూచున్నాను. ఈ పరీక్షలు రాసేవారికి మార్కులు వేయడం ఎక్కువ బాధో, లేక వీళ్లు రాస్తూ వుండగా కావలి కాయడం ఎక్కువ బాధో నిర్ణయించుకోలేకుండా వున్నాను. ఈ కావలి కాయడంలోని ఈ అనుమానంలో నైతిక నీచత్వం స్ఫురిస్తుంది. 'మీరు దొంగలు. మీకు నీతి లేదు. నేను చాలా నీతిమంతుణ్ని. మీ దొంగతనాలు పట్టి చీల్చేందుకు ఇక్కడ కూచున్నాను' అంటున్నట్టుంటుంది. వాళ్లు తలెత్తి నా వంక చూసి, మళ్లీ తలలు వొంచి రాస్తూ వుంటే, అక్కడ కూచోవడం సిగ్గేస్తుంది." (-చలం. 1937 నాటి 'మ్యూజింగ్స్'లో). "ప్రస్తుత పరీక్షల పద్ధతి విద్యార్థులను శత్రువులుగా పరిగణించేలా, వారిపై మెరుపుదాడి చేసేలా ఉంది. ఇది విద్యార్థులను ఆశ్చర్యానికి గురిచేసి, దెబ్బతీయడానికి అడవిలో పొంచి ఉండే పులి లాంటిది. ఇప్పటి పరీక్షా విధానం శత్రువులతో వ్యవహరిస్తోన్నట్టు వుంది గానీ, ప్రజలతో వ్యవహరిస్తోన్నట్టు లేదు. శత్రువుమీద ఆకస్మిక దాడులు చేసినట్టు, ఈ పరీక్షల విధానం విద్యార్థులమీద ఆకస్మిక దాడులు చేసి వారిని హడలెత్తిస్తోంది. బట్టీలు పట్టినదాన్ని తిరిగి వల్లించేట్టు చెయ్యడానికీ, మూసలో పోసినట్టు రాసే విధానాన్ని పరీక్షించడానికీ, బూర్జువా స్పెషలిస్టుల్ని తయారు చెయ్యడానికీ తప్ప, ఈ విధానం ఎందుకూ పనికిరాదు. దీన్ని పూర్తిగా మార్చేసి, విద్యార్థిలో వున్న నిజమైన శక్తిసామర్థ్యాలు బయల్పడడానికీ, నిత్యజీవితంలో ఎదురయ్యే సమస్యల్ని పరిష్కరించడానికీ ఉపయోగపడే పద్ధతులను అభివృద్ధిపరచాలి'

**(మావో. 1964లో)**

చివరిగా, 1952లో 'పెళ్లి చేసి చూడు' సినిమాలో, ఒక నాటికలో, స్కూలుకెళ్లే కుర్రాడు అనే సరదా మాటలు చూడండి: "పరీక్షలు... పరీక్షలు... పాడు పరీక్షలు! ఈ పరీక్షలు కనిపెట్టిన వాడిని పట్టుకుని నడి బజారులో నిలబెట్టి, తుపాకీతో ఠాచ్... ఠాచ్ అని కాల్చేయాలి!" ఇలా అన్న పిల్లవాడు, పరీక్షలను తప్పించుకోవడానికి, "అమ్మా నొప్పిలే! అమ్మమ్మా నొప్పిలే!" అని పాడుతూ గంతులేస్తాడు. సినిమాలో ఒక చిన్న పిల్లవాడితో చెప్పించిన ఈ మాటల వల్ల, పరీక్షలు అంటే అదేదో భూతం లాగా, భీతిగొలిపే పరిస్థితి లాగా పూర్వం నించీ ఒక అనుభవం ఉందని అర్థమవుతోంది. ఈనాటికీ, ఎంసెట్ అనీ, నీట్ అనీ, రకరకాల ప్రవేశ పరీక్షలప్పుడు, పిల్లలతో పాటు పెద్దవాళ్లు పడే ఆందోళన చూస్తే, జ్ఞానాన్ని కొలిచే సాధనంగా ఇప్పుడున్న పరీక్షా విధానం ఎంత డొల్లో తెలిసిపోతుంది.

## గర్భస్థ శిశువు లింగ నిర్ధారణపై కఠిన నిఘా



వేకువ సమయం సెప్టెంబర్ 29 కీసర ప్రతినిధి : మేడ్చల్-మల్కాజ్‌గిరి: గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ, లింగ ఎంపికను నిరోధించేందుకు పీ.సీ.పీ.ఎన్.డీ.టీ. చట్టం-1994ను కఠినంగా అమలు చేయాలని జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ సమావేశం నిర్ణయించింది. అదనపు కలెక్టర్ (పట్టణ స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్ ఐఏఎస్, సీనియర్ సివిల్ జడ్జి జీఎస్ఎల్ ప్రియాంక అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్ఓ డా. కె. ఆనంద్ కార్యదర్శిగా వ్యవహరించారు.సమావేశంలో పీ.సీ.పీ.ఎన్.డీ.టీ. నిబంధనలకు అనుగుణంగా 30 దరఖాస్తులను కమిటీ పరిశీలించింది. వీటిలో 18 కొత్తవి, 12 పునరుద్ధరణ దరఖాస్తులు కాగా, రికార్డులు పరిశీలించిన అనంతరం అన్నింటికీ ఆమోదం తెలిపింది. అల్ట్రాసౌండ్, ఇమేజింగ్ కేంద్రాల్లో పరీక్షలు చట్టబద్ధమైన వైద్య అవసరాలకు మాత్రమే పరిమితం కావాలని, నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడే కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ చట్టవిరుద్ధమనే విషయంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జడ్జి ప్రియాంక సూచించారు.పోలీసులు, వైద్య ఆరోగ్య, మహిళా-శిశు సంక్షేమ, విద్యాశాఖలు, స్థానిక సంస్థలు, అంగన్‌వాడీలు, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. ఆడపిల్లలను రక్షించి, వారికి సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అధికారులు పేర్కొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**



**వేకువ సమయం న్యూస్ మంచిర్యాల// సెప్టెంబర్ 29, 2026 :** జిల్లాలో చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. మంగళవారం జిల్లాలోని మందమర్రి పట్టణంలోని కె.ఆర్. గార్డెన్స్‌లో మందమర్రి తహసిల్దార్, మున్సిపల్ కమిషనర్, సిబ్బందితో కలిసి ఎఈఆర్ఓలు, బిఎల్ఓలు, బిఎల్ఓ సూపర్‌వైజర్లకు ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా నో మ్యాపింగ్, అనామోలీస్ సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీ చేయడం జరిగిందని, నోటీసులు జారీ అయిన ఓటర్లు సంబంధిత ధ్రువపత్రాలను సమర్పించడం ద్వారా వారి ఓటు హక్కును ధ్రువీకరించడం జరుగుతుందని తెలిపారు. ఓటర్లు సమర్పించిన ధ్రువపత్రాల వివరాలను ఆన్లైన్లో అప్లోడ్ చేయడం జరుగుతుందని, ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి దశను నిబంధనల ప్రకారం, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఖచ్చితత్వంతో పూర్తి చేయాలని సూచించారు. నిర్దేశిత గడువులోగా ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేసేలా ఎఈఆర్ఓలు, బిఎల్ఓలు, బిఎల్ఓ సూపర్‌వైజర్లు సమన్వయంతో పని చేయాలని, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 10 నెలల పసికందుకు అరుదైన ఆపరేషన్
## యశోద వైద్యుల విజయవంతమైన స్టెమ్ సెల్ మార్పిడి




సమయం: మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 29: అరుదైన వారసత్వ ఎముక మజ్జ వైఫల్యంతో బాధపడుతున్న 10 నెలల పసికందుకు యశోద ఆస్పత్రి వైద్యులు అత్యాధునిక హాప్లోయిడెంటికల్ స్టెమ్ సెల్ మార్పిడి చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా నందవరం గ్రామానికి చెందిన ముళ్ల ఖాజా, రేష్మ దంపతుల కుమారుడు ఎం. ఖాదర్ అర్మాన్ (10 నెలలు) ప్లేట్లెట్ల సంఖ్య తక్కువగా ఉండటాన్ని గుర్తించిన తల్లిదండ్రులు గతేడాది డిసెంబర్ 26న సోమాజిగూడ యశోద ఆస్పత్రికి తీసుకొచ్చారు. సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం చిన్నారికి 'అమెగాకార్యోసైటిక్ థ్రోంబోసైటోపెనియా' అనే అరుదైన వారసత్వ ఎముక మజ్జ వైఫల్య రుగ్మత ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు.ఈ వ్యాధి కారణంగా తీవ్రమైన ప్లేట్లెట్ల కొరత, రక్తస్రావం వంటి సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉంటుందని బోన్ మ్యారో మార్పిడి నిపుణుడు డాక్టర్ విక్రమ్ కుమార్ తెలిపారు. చిన్నారికి తండ్రి మూల కణాలను ఉపయోగించి జనవరి 8న హాప్లోయిడెంటికల్ స్టెమ్ సెల్ మార్పిడి చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు చెప్పారు.చికిత్స అనంతరం చిన్నారి వైద్యపరంగా స్థిరంగా ఉండటంతో డిశ్చార్జ్ చేసినట్లు వైద్యులు వెల్లడించారు. అరుదైన వారసత్వ రక్త సంబంధిత వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి ఆధునిక మూల కణ చికిత్స ద్వారా విజయవంతంగా చికిత్స అందించినట్లు తెలిపారు.

## హిందూ దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలి





మహబూబాబాద్ జిల్లా; (సెప్టెంబర్ 29 వేకువ సమయం ప్రతినిధి) : భారతీయ జనతా పార్టీ మానుకోట పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మన హిందూ దేవుళ్ళపై (డబ్బులు ఉన్న వారు రాముడుని పూజిస్తారు, డబ్బులు లేని వారు శివుని పూజిస్తారు అని) అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ, స్థానిక ఎమ్మార్వో ఆఫీస్ నుండి నెహ్రూ సెంటర్ వరకు నల్ల బ్యాడ్జీలతో భారీ ఎత్తున ర్యాలీని నిర్వహించి, హిందూ దేవుళ్ళపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ తో, నిరసన తెలుపుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, దిష్టిబొమ్మను దహనం చేయడం జరిగింది. దిష్టిబొమ్మను దహనం చేసే సమయంలో బిజెపి నాయకులకు పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. ఈ తోపులాటలో కొంతమంది బిజెపి నాయకులకు స్వల్ప గాయాల అవడం జరిగింది. పోలీసు వ్యవస్థ అధికార పక్షానికి కొమ్ముకాస్తూ, బిజెపి నాయకులపై దాడి చేయడం ఎంత మాత్రం సమంజసం కాదు అని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్చార్జి యాల్దీ మల్లయ్య, 26వ వార్డు కౌన్సిలర్ మాలోతు శ్రీదేవి బాలునాయక్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ శ్యామ్ సుందర్, మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రేష్మ, బిజెపి జిల్లా కార్యదర్శి ధార ఇందు భారతి, రూరల్ మండలం అధ్యక్షులు జయేందర్, పట్టణ ప్రధాన కార్యదర్శిలు రవి నాయక్, నరేష్, రూరల్ మండల ప్రధాన కార్యదర్శి హుస్సేన్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు దిడ్డి మహేష్, ఎస్టి మోర్చా జిల్లా అధ్యక్షులు సురేష్, పట్టణ ఉపాధ్యక్షులు రవి యాదవ్, మాలోతు బాలు నాయక్, ప్రతాప్ రెడ్డి, బొబ్బ సురేందర్, ఐదవ వార్డు సంతోష్, ఆరో వార్డు సంతోష్, సురేష్, సుజాత, మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు మార్గం శైలజ, గాడిపల్లి శ్యామ్, యాస్వంత్, జాన్సన్ అనిల్, బీజేవైఎం మాలే సాయి, ఎస్టి మోర్చా కేలోతు గణేష్, తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా వేడుకలు

మహబూబాబాద్ జిల్లా; (సెప్టెంబర్ 29 వేకువ సమయం ప్రతినిధి) : అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం-2026ను పురస్కరించుకొని 2026 అక్టోబర్ 1వ తేదీన ఉదయం 11:30 గంటలకు ఐ డి ఓ సి, మహబూబాబాద్ లో వయోవృద్ధుల కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి, మహిళా, శిశు, దివ్యాంగులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి శిరీష నేడు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లాలోని వయోవృద్ధులు/సీనియర్ సిటిజన్లు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.వయోవృద్ధుల సంక్షేమం, వారి హక్కులు, ఆరోగ్యం, సామాజిక భద్రత మరియు గౌరవప్రదమైన జీవనం వంటి అంశాలపై కార్యక్రమంలో అవగాహన కల్పించనున్నారు. వయోవృద్ధుల పట్ల సమాజంలో గౌరవం, ఆదరణ మరియు బాధ్యతాభావాన్నిపెంపొందించడంతో పాటు, వారి అనుభవాలు మరియు సేవలను గుర్తిస్తూ ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున, జిల్లాలోని సీనియర్ సిటిజన్లు/ వయోవృద్ధులు 01.10.2026న ఉదయం 11:30 గంటలకు ఐ డి ఓ సి, మహబూబాబాద్ లో జరిగే అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకల్లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

# జవహర్ నవోదయ విద్యాలయ అభివృద్ధికి పీఎం శ్రీ నిధులను సద్వినియోగం చేయాలి

**విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సాంకేతిక పరిజ్ఞానం, సృజనాత్మకతకు ప్రాధాన్యం**
**జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను విద్యార్థులు సందర్శించేలా ఏర్పాట్లు,**
**20 కంప్యూటర్లు మంజూరు చేసిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**



**నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి సెప్టెంబర్ 29:** నాగర్‌కర్నూల్ జిల్లా వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం, ఆధునిక మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు పాఠశాల సమగ్ర అభివృద్ధికి పీఎం శ్రీ పథకం కింద అందుబాటులో ఉన్న నిధులను సమర్థవంతంగా సద్వినియోగం చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సూచించారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అధ్యక్షతన జవహర్ నవోదయ విద్యాలయ పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధి, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, పీఎం శ్రీ పథకం కింద చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, నిధుల వినియోగం తదితర అంశాలపై పాఠశాల ప్రిన్సిపల్ బి. పూర్ణిమను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ....., విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు సాంకేతిక పరిజ్ఞానం, సృజనాత్మకత, వివిధ నైపుణ్యాలను పెంపొందించేలా పాఠశాలలో అవసరమైన మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయాలని, పీఎం శ్రీ పథకం ద్వారా పాఠశాలకు అందుబాటులో ఉన్న నిధులను విద్యార్థులకు ప్రత్యక్షంగా ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ పారదర్శకంగా, సమర్థవంతంగా వినియోగించాలని ఆదేశించారు. విద్యార్థుల్లో సంగీతంపై ఆసక్తిని పెంపొందించేందుకు మ్యూజిక్ టీచర్ నియామక ప్రక్రియ పూర్తయిందా లేదా అనే అంశంపై ప్రిన్సిపల్‌ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు విద్యతో పాటు సంగీతం, కళలు, క్రీడలు తదితర రంగాల్లోనూ నైపుణ్యాలను పెంపొందించే అవకాశాలు కల్పించాలని సూచించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని ప్రముఖ పర్యాటక, చారిత్రక, ప్రకృతి అందాలకు సంబంధించిన ప్రదేశాలను జవహర్ నవోదయ విద్యాలయ విద్యార్థులు సందర్శించేలా అవసరమైన ఏర్పాట్లు కల్పించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. తరగతి గది విద్యతో పాటు జిల్లాలోని చారిత్రక, సాంస్కృతిక, ప్రకృతి వైవిధ్యాన్ని విద్యార్థులు ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కల్పించడం ద్వారా వారి విజ్ఞాన పరిధిని విస్తరించవచ్చని, విద్యార్థుల విద్యాభ్యాసానికి సాంకేతిక పరిజ్ఞానం మరింత అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో పాఠశాలకు అవసరమైన 20 కంప్యూటర్లను జిల్లా కలెక్టర్ మంజూరు చేశారు. కంప్యూటర్ విద్య ద్వారా విద్యార్థుల్లో డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించి, ఆధునిక విద్యా విధానాలకు అనుగుణంగా వారిని తీర్చిదిద్దాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యా వనరులు తదితర అంశాలపై కూడా సమావేశంలో చర్చించారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. 11వ, 12వ తరగతి విద్యార్థులకు ఐఐటీ ప్రవేశ పరీక్షల కోసం ప్రత్యేక బోధనా కార్యాచరణను రూపొందించి అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించి వారికి అవసరమైన అదనపు బోధన, మార్గదర్శకత్వం అందించేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థుల పరీక్షల ఉత్తీర్ణత శాతాన్ని మరింత పెంచేలా తరగతుల వారీగా ఫలితాలను విశ్లేషించి, అవసరమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు వారి ప్రతిభను వెలికితీసేందుకు విద్యా, సాంస్కృతిక, క్రీడా, సాంకేతిక కార్యక్రమాలకు సముచిత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వచ్చే విద్యా సంవత్సరానికి 6వ, 9వ, 11వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం కొనసాగుతున్న నమోదు ప్రక్రియపై కూడా జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. ఈ నెల 30వ తేదీ వరకు ఉన్న నమోదు గడువులోగా అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఖాళీ సీట్లు మిగలకుండా నమోదు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రమేష్ కుమార్, జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ బి. పూర్ణిమ, పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు ఎస్. బాలాజీ నాయక్, డీఈ శిరీష్, డాక్టర్ సృజన, పేరెంట్స్ కమిటీ సభ్యులు రవికుమార్, ఎం. రాజు తదితరులు పాల్గొన్నారు.

# టీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి ..



**- కె.టి.దొడ్డి మండలంలో (టీఆర్ఎస్) పార్టీ జెండాపండుగ.**
**- నూతన పార్టీ జెండాను ఆవిష్కరించిన గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి గొంగళ్ల రంజిత్ కుమార్.**

సమయం ప్రతినిధి : మండల కేంద్రంలో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ జెండా పండుగ సందర్భంగా నూతన జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని మంగళవారం పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీఆర్ఎస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి గొంగళ్ల రంజిత్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై టిఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అంతకు ముందు పార్టీ నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గ ఇన్‌చార్జి గొంగళ్ళ రంజిత్ కుమార్‌కు పుష్పగుచ్చం అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం మహనీయుల చిత్రపటాలకు ఘన నివాళులర్పించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గొంగళ్ల రంజిత్ కుమార్ మాట్లాడుతూ...తెలంగాణ రక్షణ సేన పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలు, లక్ష్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి నాయకుడు, కార్యకర్తపై ఉందన్నారు. తెలంగాణ ప్రజల హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ రక్షణ సేన పార్టీ నిరంతరం ప్రజల పక్షాన నిలబడుతుందని తెలిపారు. పార్టీ అధినేత కల్వకుంట్ల కవిత ప్రకటించిన పాంచజన్యంలో పేర్కొన్న విద్య, వైద్యం, అభివృద్ధి, సామాజిక న్యాయం, వ్యవసాయం వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ అట్టడుగు వర్గాల సమస్యలను పరిష్కరించడం కోసం కృషి చేస్తామని తెలిపారు. రైతులు, పేదలు, కార్మికులు, యువత, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ప్రజల హక్కుల కోసం ఉద్యమిస్తామని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో పనిచేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రతి గ్రామంలో పార్టీ కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం నిరంతరం పనిచేయాలని కోరారు. కేటీ.దొడ్డి మండలంలో పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు కొత్తగా యువతను, ప్రజలను పార్టీతో అనుసంధానం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ మండల నాయకులు సుభాష్, రేణప్ప, ఉరుకుందు, అంజి, గట్టు మండల అధ్యక్షులు బలరాం నాయుడు, వెంకట్రాములు, బత్తలయ్య, శివన్న మల్దకల్ మండల నాయకులు విష్ణు, ప్రేమరాజ్, గోపాల్ లక్ష్మన్న, గొర్ల తిమ్మప్ప, ధరూర్ మండల నాయకులు మల్దకల్, అడవి ఆంజనేయులు, వెంకటేష్ నాయకులు అంజి, భీమన్ గౌడ్, రాము, సుదర్శన్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి: డీఎంహెచ్‌ఓ డా. కె. ఆనంద్



వేకువ సమయం సెప్టెంబర్ 29 కీసర ప్రతినిధి : మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా: ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. కె. ఆనంద్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కార్యక్రమ అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో అమలవుతున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిని అధికారులు సమీక్షించారు. బస్తీ, పల్లె దవాఖానాలతో పాటు ప్రాథమిక, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది విధుల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని డా. ఆనంద్ ఆదేశించారు. సమయపాలన పాటిస్తూ నిర్ణీత వేళల్లో ప్రజలకు వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. మాతా–శిశు ఆరోగ్య సేవలు, హెచ్‌పీవీ టీకా కార్యక్రమం, సాధారణ ఇమ్యూనైజేషన్‌ను మరింత పటిష్టం చేయాలని సూచించారు. క్షయ, కుష్ఠు వ్యాధుల అనుమానితులను త్వరగా గుర్తించి పరీక్షలు, చికిత్స, తదుపరి పర్యవేక్షణ సమర్థవంతంగా చేపట్టాలన్నారు. అంటువ్యాధులపై నిరంతర నిఘా ఉంచడంతో పాటు అధిక రక్తపోటు, మధుమేహం వంటి అసాంక్రమిక వ్యాధులను ముందస్తుగా గుర్తించి చికిత్స అందించాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, బాధ్యులపై నిబంధనల ప్రకారం శాఖాపరమైన చర్యలు తప్పవని డా. ఆనంద్ హెచ్చరించారు. జిల్లాలో సిబ్బంది కొరతను అధిగమించేందుకు చర్యలు చేపడుతున్నామని, ఖాళీ పోస్టులను త్వరలో భర్తీ చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రజలకు నిరంతరం నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలి : దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి



దేవరకద్ర : హైద్రాబాద్ రంగారెడ్డి మహబూబ్ నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలోదేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి తన ఓటును చేసుకునేందుకు ఎన్‌రోల్‌మెంట్ ఫారమ్‌ను పూర్తి చేసి నమోదు చేసుకున్నారు.. హైద్రాబాద్ రంగారెడ్డి మహబూబ్ నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. గతంలో ఓటు వేసిన వారు కూడా తప్పనిసరిగా మళ్ళీ ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. నిర్ణీత గడువులోగా అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని,ప్రతి గ్రాడ్యుయేట్ నమోదు చేసుకునేలా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు చొరవ తీసుకుని ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.

## అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలి: మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్



మహబూబ్ నగర్ :త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మహబూబ్‌నగర్‌లో మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ కూతుర్లు శ్రీహిత, శ్రీహర్షిత కుమార్తెలతో కలిసి ఓటరుగా నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా అర్హులైన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకుని, తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. 2023 కంటే ముందు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉంది. గత ఎన్నికల్లో ఓటు వేశాము కాబట్టి ఇప్పుడు మళ్లీ నమోదు అవసరం లేదని భావించకండి. అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలి. ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు, ఎన్నికల్లో తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి. మీతో పాటు మీ కుటుంబ సభ్యులు, స్నేహితులు, పరిచయస్తులైన అర్హులైన పట్టభద్రులను కూడా ఓటరుగా నమోదు చేయించాలి. ఎన్నికలు జరగనున్న ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లోని అర్హులైన పట్టభద్రులు నిర్ణీత గడువులోగా దరఖాస్తు ఫారాన్ని పూర్తి చేసి ఓటరు నమోదును చేసుకోవాలని కోరారు. అదేవిధంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియలో పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో యువతకు సహకరించాలని మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ సూచించారు.

## ఎస్సీ, బీసీ, ఎస్టీ సంక్షేమ హాస్టళ్లను గాలికి వదిలేసిన ప్రభుత్వం



దేవరకొండ: సెప్టెంబర్ 29 (సమయం ప్రతినిధి) : విద్యార్థుల సమస్యలను పట్టించుకోని అధికారులు, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న వార్డెన్లు -తక్షణమే కాస్మొటిక్, మెస్ చార్జీలు విడుదల చేయాలి - విద్యార్థులకు అందుబాటులో లేని వార్డెన్లపై చర్యలు తీసుకోవాలి బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ ఎస్సీ, బీసీ, ఎస్టీ సంక్షేమ హాస్టళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ ఆరోపించారు. మంగళవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ......హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. హాస్టల్ వార్డెన్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ విద్యార్థులకు అందుబాటులో ఉండటం లేదని, అధికారులు కూడా సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. హాస్టళ్లలో ప్రభుత్వం నిర్దేశించిన మెనూను సక్రమంగా అమలు చేయడం లేదని, నాణ్యత లేని ఆహారం అందడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. విద్యార్థులకు అందుబాటులో ఉండకుండా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న వార్డెన్లపై కఠిన చర్యలు తీసుకుని, అవసరమైతే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ల పరిస్థితి అధ్వానంగా మారుతోందని ఆయన అన్నారు. మౌలిక వసతుల కొరత, మెస్ సమస్యలు, పారిశుద్ధ్య సమస్యలు తదితర ఇబ్బందులతో విద్యార్థులు సతమతమవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి హాస్టళ్లలో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని కోరారు. "కేసీఆర్ ప్రభుత్వ హయాంలో విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చి ప్రభుత్వ హాస్టళ్లను అభివృద్ధి చేస్తే, నేడు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వాటి పరిస్థితి దయనీయంగా మారుతోంది" అని బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. ప్రభుత్వం మొద్దునిద్ర వీడి సంక్షేమ హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, పెండింగ్‌లో ఉన్న కాస్మొటిక్, మెస్ చార్జీలను తక్షణమే విడుదల చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభించిన మాజీ మంత్రి స్వయంగా ఓటు నమోదుకు శ్రీకారం చుట్టిన గౌరవ నిరంజన్ రెడ్డి



వనపర్తి : హైదరాబాద్, రంగారెడ్డి,మహబూబ్ నగర్ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియను తన స్వగృహంలో ప్రారంభించారు. తనతో పాటు గ్రాడ్యుయేట్ ఓటర్లకు అవగాహన కల్పించి స్వయంగా ఓటు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ఓటరు నమోదు ప్రక్రియ అత్యంత కీలకమైందని బాధ్యతగా ఓటు నమోదు చేసుకోవాలని, నవంబర్ 2023 వరకు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినవారు అర్హులు అవుతారని కాబట్టి ప్రతి గ్రాడ్యుయేట్ ఓటు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి,ప్రజాస్వామ్య మనుగడకు ఏకైక ఆయుధమని కాబట్టి విజ్ఞులు గ్రాడ్యుయేట్ ఎన్నికలలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఓటు నమోదు చేసుకున్న వారిలో నందిమల్ల.అశోక్, కౌన్సిలర్.శ్రీకర్ గౌడ్,పలుస.శంకర్ గౌడ్,వెంకట్ సాగర్,ఉంగ్లం. తిరుమల్, సూర్యవంశం .గిరి, జోహెబ్ హుస్సేన్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో వాకిటి.శ్రీధర్,కె.మాణిక్యం, ధర్మా నాయక్, మహేశ్వర్ రెడ్డి,దేవర్ల. నరసింహ, నీలస్వామి,మంద.రాము ఉన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి

వేకువ సమయం సెప్టెంబర్ 29 కీసర ప్రతినిధి : తెలంగాణలో విద్యా విధానాల్లో తరచూ మార్పులు, నిర్ణయాలపై అయోమయం విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన కలిగిస్తున్నాయని సీనియర్ జర్నలిస్టు పొన్నాల గౌరీశంకర్ అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కీలక నిర్ణయాలపై ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు, నిపుణులతో విస్తృతంగా చర్చించాలని కోరారు. విద్యార్థులపై ప్రయోగాలు చేయకుండా దీర్ఘకాలిక విద్యా విధానాన్ని రూపొందించాలని, ఇంటర్ విద్య, పాఠ్యాంశాలు, పరీక్షల విధానం, ఉన్నత విద్య అవకాశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు ఉండాలని సూచించారు. అలాగే తెలంగాణ సంస్కృతి, చరిత్రలో కీలకమైన తెలుగు భాషకు సముచిత ప్రాధాన్యం ఇస్తూనే, ఆధునిక పోటీ ప్రపంచానికి అవసరమైన ఇతర భాషలు, నైపుణ్యాలపై విద్యార్థులకు శిక్షణ కల్పించాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తు రాజకీయాలకు అతీతంగా ఉండేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపాలని, విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యావేత్తలతో సమావేశాలు నిర్వహించి వారి సూచనలు తీసుకోవాలని పొన్నాల గౌరీశంకర్ కోరారు.

వేకువ సమయం
బుధవారం 30 సెప్టెంబర్ 2026

# ఉగ్గంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాష్ట్ర ప్రజారోగ్య వైద్య సంచాలకులు డాక్టర్ రవీంద్ర నాయక్ ఆకస్మిక తనిఖీ

మహబూబాబాద్ జిల్లా/చిన్న గూడూరు, సెప్టెంబర్ 29 వేకువ సమయం ప్రతినిధి : తెలంగాణ రాష్ట్ర ప్రజారోగ్య వైద్య సంచాలకులు డాక్టర్ రవీంద్ర నాయక్ హైదరాబాద్ గారు మహబూబాబాద్ జిల్లాలోని చిన్నగూడురు మండలం ఉగ్గంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని హాజరు పట్టిక, ల్యాబొరేటరీ సేవలు, రోగులకు అందుబాటులో ఉన్న మందుల నిల్వలు మరియు పంపిణీ వివరాలను పరిశీలించారు. అలాగే గర్భిణీ స్త్రీల నమోదు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల ప్రోత్సాహం, ప్రజలకు అందిస్తున్న వివిధ ఆరోగ్య సేవలపై సమీక్ష నిర్వహించారు. అదేవిధంగా కేంద్ర ఆరోగ్య పథకాల అమలు, సీజనల్ వ్యాధుల నియంత్రణలో భాగంగా మలేరియా, డెంగ్యూ జ్వరాల నివారణ మరియు నియంత్రణ చర్యలపై అధికారులతో సమీక్షించారు. జిల్లాలో అమలవుతున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాలలో నిర్దేశించిన లక్ష్యాలను సాధిస్తూ మహబూబాబాద్ జిల్లా రాష్ట్రస్థాయిలో ముందంజలో ఉండేలా కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ కి సూచనలు, సలహాలు అందించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఉగ్గం పల్లి వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్,మర్రిపెడ వైద్యాధికారి డాక్టర్ రవి, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





## అక్టోబర్1, 2, పాటు మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపివేత

మహబూబాబాద్ జిల్లా (సెప్టెంబర్ 29 వేకువ సమయం ప్రతినిధి) : మహబూబాబాద్, కేసముద్రం, డోర్నకల్ మున్సిపాలిటీలు కురవి , ఇనుగుర్తి, సిరోలు, డోర్నకల్ మండలంలో రెండు రోజులు అక్టోబర్1, 2, పాటు మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపివేత ప్రత్యామ్నాయ మంచినీటి సరఫరా ఏర్పాట్లు చేయాలి: మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ మాణిక్యరావు. గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల కారణంగా పైన చూపిన మండలాలు మున్సిపాలిటీల పరిధిలో గురువారం, శుక్రవారం రెండు రోజుల పాటు మిషన్ భగీరథ ద్వారా వచ్చే తాగునీటి సరఫరా తాత్కాలికంగా నిలిచిపోనుందని మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ మాణిక్య రావు, మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నీటి సరఫరా నిలిచిపోవడం వల్ల ప్రజలకు ఎటువంటి తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా కురవి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తక్షణమే ప్రత్యామ్నాయ మంచినీటి సరఫరా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అలాగే, ఈ నీటి నిలిపివేత విషయాన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు గ్రామాల్లో టామ్‌టామ్ (దండోరా) ద్వారా విస్తృతంగా ప్రచారం చేసి, ప్రజలకు ముందస్తు సమాచారం అందించాలని సూచించారు. రెండు రోజుల పాటు ప్రజలు ప్రత్యామ్నాయ స్థానిక వనరులు, నీటి సరఫరా మార్గాలను వినియోగించుకొని అధికారులకు సహకరించాలని సంబంధిత శాఖ అధికారులు కోరారు.

## అంగన్‌వాడీ టీచర్లను SIR విధుల నుంచి రిలీవ్ చేయాలి

వేకువసమయం సెప్టెంబర్ 29 కీసర ప్రతినిధి : నాగారం: అంగన్‌వాడీ టీచర్లపై అదనపు పనిభారం మోపకుండా, SIR ప్రక్రియలో అప్పగించిన అదనపు విధుల నుంచి వారిని వెంటనే రిలీవ్ చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల పరిస్థితిపై సంబంధిత అధికారులతో పార్టీ ప్రతినిధులు చర్చించారు. చిన్నారుల సంరక్షణ, పోషకాహారం, అంగన్‌వాడీ కార్యక్రమాల నిర్వహణ వంటి కీలక బాధ్యతలతో ఇప్పటికే సిబ్బందిపై పనిభారం ఉందని, దీనికి అదనంగా SIR విధులు అప్పగించడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు పేర్కొన్నారు. అంగన్‌వాడీ టీచర్లపై ఎలాంటి ఆరోపణలు లేవని, సమస్య అదనపు విధుల కేటాయింపులోనే ఉందన్నారు.అంగన్‌వాడీ సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా అవసరమైన సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, SIR అదనపు విధుల నుంచి అంగన్‌వాడీ టీచర్లను తక్షణమే రిలీవ్ చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు గంద్ర కమలాకర్ పటేల్, రాచమల్ల లక్ష్మణ్, నాయకపు రామ్ నరసయ్య, ప్రవీణ్ కుమార్, నాగరాజ్, సాయికిరణ్, దేవుల నాయక్ డిమాండ్ చేశారు.

## పెద్దాపూర్ కు సమయనికి బస్ సౌకర్యం కల్పించాలి



నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి సెప్టెంబర్ 29: పెద్దాపురం గ్రామానికి సరైన సమయంలో బస్ సౌకర్యం కల్పించాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ బస్ డిపో మేనేజర్ యాదయ్య కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నగర సంయుక్త కార్యదర్శి శివ కుమార్ మాట్లాడుతూ... బస్సు సౌకర్యం సరైన సమయానికి రాక విద్యార్థులు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు ఉదయం సమయంలో కొంచెం లేటుగా సాయంత్రం సమయంలో లేటుగా రావడంతో విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని ఉదయం పెద్దాపూర్ గ్రామానికి 8:30 గంటలకు రావాలి సాయంకాలం కర్నూల్ నుండి 5:30 కి వెళ్లాలని కోరారు ఈ యొక్క సమస్యను పరిష్కరించాలని కోరారు ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి ప్రసాద్, శివ, మహేష్, వినయ్, అంజి,బాబు, అఖిల్ ఏబీవీపీ నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## కేసముద్రం మున్సిపాలిటీలో 2-B బార్ ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

జిల్లా ఎక్సైజ్ సూపరిడెంట్ పి.కరంచంద్.

మహబూబాబాద్ జిల్లా సెప్టెంబర్ 29 వేకువ సమయం ప్రతినిధి : వార్షిక బార్ ఎక్సైజ్ పన్ను స్లాబ్ రూ. 30.00 లక్షలుగా నిర్ణయం అక్టోబర్ 12 వరకు దరఖాస్తుల స్వీకరణ, అక్టోబర్ 16న లాటరీ ద్వారా ఎంపిక తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అబ్కారీ శాఖ కమిషనర్ వారి ఉత్తర్వుల (Cr. No. 3168/2017/CPE/TG/F1, తేది: 26.09.2026) ప్రకారం, మున్సిపాలిటీల పరిధిలో 2-B బార్ల స్థాపనకు ముందస్తు అనుమతి మంజూరు నిమిత్తం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా మద్య నిషేధ అబ్కారీ అధికారి తెలిపారు. ఈ నోటిఫికేషన్‌లో భాగంగా మహబూబాబాద్ జిల్లాలోని కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో ఒక (1) 2-బీ బార్‌ను ఏర్పాటు చేయడానికి నోటిఫై చేశారు. సదరు బార్‌కు వర్తించే వార్షిక బార్ ఎక్సైజ్ పన్ను స్లాబ్ రూ. 30.00 లక్షలుగా నిర్ణయించబడిందని అన్నారు.దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం: 28.09.2026 నుండి చివరి తేదీ: 12.10.2026 (సాయంత్రం 5:00 గంటల వరకు) లాటరీ ద్వారా ఎంపిక తేది ఒ సమయం: 16.10.2026న ఉదయం 11:00 గంటలకు, లాటరీ వేదిక: IDOC, కాన్ఫరెన్స్ హాల్, మహబూబాబాద్ దరఖాస్తుల సమర్పణ సమయం: పని దినాలలో ఉదయం 10:30 నుండి సాయంత్రం 5:00 గంటల వరకు

**దరఖాస్తులు సమర్పించాల్సిన కార్యాలయాలు:**

1. మద్య నిషేధ మరియు అబ్కారీ శాఖ కమిషనర్ కార్యాలయం, తెలంగాణ, హైదరాబాద్.
2. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, వరంగల్ వారి కార్యాలయం.
3. జిల్లా మద్య నిషేధ మరియు అబ్కారీ అధికారి, మహబూబాబాద్ వారి కార్యాలయం.

**జతపరచవలసిన పత్రాలు:**

నిర్ణీత నమూనాలోని ఫారం-1(A) లో పూర్తి చేసిన దరఖాస్తు.
ప్రతి దరఖాస్తుకు రుసుము రూ. 1,00,000/- (అక్షరాలా రూపాయి లక్ష మాత్రమే – నాన్ రిఫండబుల్) చెల్లించిన డిమాండ్ డ్రాఫ్ట్ (DD) / చలాన్.
ఇటీవల తీయించుకున్న 3 కలర్ పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు.
ఆధార్ కార్డు పాన్ కార్డు యొక్క స్వీయ ధృవీకరించిన (Self-Attested) ప్రతులు.
2-B బార్ల వివరాలు, పూర్తి నోటిఫికేషన్, షెడ్యూల్ మరియు మార్గదర్శకాలు తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (TGBCL) అధికారిక వెబ్‌సైట్ tgbcl.telangana.gov.in లో అందుబాటులో ఉన్నాయి. ఆసక్తి గల దరఖాస్తుదారులు నిబంధనల ప్రకారం తమ దరఖాస్తులను గడువులోగా సమర్పించాలని అధికారి ఈ సందర్భంగా కోరారు.

## అమరచింతలో రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం

అమరచింత : హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా శైవ, వైష్ణవ మతాలపై వ్యాఖ్యలు చేశారంటూ ఆరోపిస్తూ బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు అమరచింత మండల బీజేపీ శాఖ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు బీజేపీ మండల నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా బిజెపి నారాయణపేట జిల్లా కార్యదర్శి, అమరచింత మున్సిపల్ కౌన్సిలర్ మేర్వ రాజు మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో రైతుల బాధల ఘోష పెడుతుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మత ఘర్షణలు సృష్టిస్తున్నారని ఈ విషయంలో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించకుండా నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్సు భూస్థాపితం చేసేందుకు బిజెపి ప్రభుత్వాన్ని స్థాపించేందుకు ప్రజలు కంకణబద్ధులు కావాలని ఆయన పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మేర్వ అనిల్ ఎంకంపల్లి శ్రీను ఒగ్గ సాయి, గణేష్, తదితరులు పాల్గొన్నారు.



## ఎంవీఎస్ జూనియర్ కళాశాలకు మహర్దశ

**రూ. 7.95 కోట్లతో అత్యాధునిక భవన నిర్మాణం.. త్వరలోనే శంకుస్థాపన చేయనున్న ప్రభుత్వ విప్**



మహబూబ్‌నగర్ : పట్టణంలోని చారిత్రాత్మక ఎంవీఎస్ (MVS) ప్రభుత్వ జూనియర్ కళాశాల రూపురేఖలు సమూలంగా మారనున్నాయి. పేద, మధ్యతరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి వసతులతో నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం రూ. 7.95 కోట్ల భారీ నిధులను మంజూరు చేసింది. ఈ నూతన భవన నిర్మాణ పనులకు స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి అతి త్వరలోనే భూమిపూజ చేయనున్నారు. ఎంవీఎస్ (MVS) జూనియర్ కళాశాల భవన నిర్మాణ ప్రాజెక్టు ముఖ్యాంశాలు: విశాల ప్రాంగణం : ఏకంగా 6 ఎకరాల విస్తీర్ణంలో,రూ. 7.95 కోట్ల భారీ నిధులతో ఆహ్లాదకరమైన వాతావరణంలో నూతన భవన నిర్మాణం. ఆధునిక వసతులు : విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా విశాలమైన క్లాస్‌రూమ్‌లు, ప్రత్యేక పరిపాలనా విభాగాలు. అత్యాధునిక ల్యాబ్‌లు : సైన్స్ విద్యార్థుల ప్రాక్టికల్స్ కోసం ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ విభాగాలకు హైటెక్ ప్రయోగశాలలు. డిజిటల్ విద్య & లైబ్రరీ : విశాలమైన రీడింగ్ రూమ్‌తో కూడిన అత్యాధునిక గ్రంథాలయం, డిజిటల్ లెర్నింగ్ క్లాస్‌రూమ్‌లు. మౌలిక సదుపాయాలు : నిరంతర శుద్ధ తాగునీరు, బాలబాలికలకు ప్రత్యేక శౌచాలయాలు, క్రీడా మైదానం అభివృద్ధి.

## అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాల్లో భాగంగా సైబర్ నేరాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం





వనపర్తి :అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో వయోవృద్ధులకు సైబర్ నేరాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరగాళ్ల మోసపూరిత కాల్స్, మెసేజ్‌లు, అనుమానాస్పద లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫేక్ అప్‌డేట్, ఆధార్ అప్‌డేట్ తదితర పేర్లతో ఫోన్ చేసి OTP చెప్పాలని అడగడం, వివిధ రకాల లింకులు పంపించి వాటిని ఓపెన్ చేయమని కోరడం వంటి మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ OTP, PIN, ATM/డెబిట్ కార్డు వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలు వంటి రహస్య సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. 18 ఏళ్ల నుంచి 70 ఏళ్ల వయస్సు వరకు వివిధ వయస్సుల వారు సైబర్ నేరాలకు గురైన సందర్భాలు ఉన్నందున, వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ డిజిటల్ లావాదేవీల విషయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్, మెసేజ్‌లు మరియు అనుమానాస్పద లింకులకు స్పందించకుండా, ముందుగా వాటి నిజానిజాలను నిర్ధారించుకోవాలని సూచించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని తెలిపారు. అలాగే అనుమానాస్పద సైబర్ నేరాలపై వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో DCRB DSP బాలాజీ, DIO రాకేష్ రెడ్డి, DLSA కృష్ణయ్య, జజ్జూరా అమ్మతమ్మ, DWO సూపరింటెండెంట్ అరుంధతి, DWO సుధారాణి పాల్గొన్నారు. అలాగే SI అంజద్ ఆలీ షీటీం సైబర్ SI రవి ప్రకాశ్ మరియు సైబర్ టీమ్ పాల్గొని వయోవృద్ధులకు సైబర్ భద్రతపై అవగాహన కల్పించారు. అప్రమత్తతే సైబర్ నేరాల నుంచి రక్షణ – OTP చెప్పొద్దు, అనుమానాస్పద లింకులు ఓపెన్ చేయొద్దని సూచించారు.

## ఇద్దరు మున్సిపల్ ఉద్యోగుల సస్పెన్షన్

గద్వాల : మున్సిపాలిటీలో మున్సిపల్ షాపుల అద్దెలకు సంబంధించి వసూలు చేసిన రూ.11.28 లక్షలు సంబంధిత అధికారులు మున్సిపల్ ఖాతాలో జమ చేయకపోవడాన్ని తీవ్ర తప్పిదంగా పరిగణిస్తూ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ మంగళవారం తగు చర్యలు చేపట్టారు. ఈ వ్యవహారంలో సీనియర్ అసిస్టెంట్, ఇన్‌చార్జ్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజవర్ధన్, జూనియర్ అసిస్టెంట్, ఇన్‌చార్జ్ షరాఫ్ రాజవర్ధన్ నాయుడులను సస్పెండ్ చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణకు అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) నర్సింగారావును విచారణ అధికారిగా నియమించారు. సంబంధిత రశీదు పుస్తకాలు, రికార్డులు, రిమిటెన్స్ వివరాలను పరిశీలించి సమగ్ర నివేదిక సమర్పించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# ఎస్సీ కార్పొరేషన్ నిధులు వెంటనే విడుదల చేయాలి



## చేవెళ్ల ఎస్సీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి: అంకురీ నర్సింహా, ఎస్సీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షులు

దేవరకొండ: సెప్టెంబర్ 29 (సమయం ప్రతినిధి) : ఈ రోజు భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి చినేని జాని ఆధ్వర్యంలో ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం ఈడి కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నకిరేకంటి మొగులయ్య మరియు ఎస్సీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీ అంకురీ నర్సింహ మాట్లాడుతూ గడిచిన మూడు ఆర్థిక సంవత్సరాలుగా ఎస్సీ కార్పొరేషన్‌కు నిధుల కేటాయింపులో జాప్యం చేయడంతో పాటు, కేటాయించిన నిధులను సైతం పూర్తి స్థాయిలో విడుదల చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈ ధర్నా కార్యక్రమంలో మాట్లాడుతూ, రాష్ట్రంలోని దళితుల ఆర్థికాభివృద్ధి కోసం ఉద్దేశించిన పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. బడ్జెట్‌లో 40 కోట్లు రూపాయలు ప్రకటించి రాష్ట్రంలో కాని జిల్లాలో కానీ నాలుగు రూపాయలు ఖర్చు చేయలేదని జిల్లాకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఎస్సీల అభివృద్ధి కోసం ఏం చేశారో చెప్పాలని ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దళిత యువతకు స్వయం ఉపాధి, ఆర్థిక సహాయం, జీవనోపాధి కల్పించే పథకాలను సమర్థవంతంగా అమలు చేయాల్సిన ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. అదేవిధంగా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, దళితులకు అందాల్సిన ప్రభుత్వ ఆర్థిక ప్రయోజనాలను వారికి చేరేలా చేయడంలో విఫలమయ్యారని ఆయన విమర్శించారు. అధికారులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి అర్హులైన దళితులకు పథకాల ప్రయోజనాలు అందేలా చూడాలని డిమాండ్ చేశారు. చేవెళ్ల దళిత డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేసారు. దళితులకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరారు, ఎస్సీల హక్కులు, ఆర్థిక సాధికారత కోసం బీజేపీ ఎస్సీ మోర్చా నిరంతరం పోరాటం చేస్తుందని వారం రోజుల్లో కార్యాచరణ ప్రకటించాలని లేనియెడల కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి రుద్రవరపు లింగస్వామి మాస శ్రీనివాస్ ఎస్సీ మోర్చ రాష్ట్ర నాయకులు, మాజీ ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షులు పేరిక మునికుమార్, ఎస్సీ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఉబ్బపల్లి నంద, చిత్రం ఉదయ్, జిల్లా ఉపాధ్యక్షులు మేదరి సైదులు, జిల్లా కోశాదికారి అదిమల్ల దేవేందర్ జిల్లా నాయకులు చింతపల్లి వెంకన్న, ఎస్సీ మోర్చ జిల్లా కార్యవర్గ సభ్యులు పొలిమేర నర్సింహ, నల్లగొండ లింగయ్య, ఎర్ర యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# పలువురు బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్లో చేరిక



దేవరకద్ర : మూసాపేట్ మండలం పోల్కంపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు బొడ్డు శెరిల నర్సింహులు , బైకని కృష్ణయ్య పలువురు బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున మహిళలు...నేడు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (GMR) సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు, ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఎమ్మెల్యే జియంఆర్ ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే జియంఆర్ నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు నచ్చి కాంగ్రెస్ పార్టీలో చేరామని పేర్కొన్నారు. తదనంతరం చిన్నచింతకుంట మండలం కురుమూర్తి గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ ఎమ్మెల్యే జియంఆర్ అందజేశారు.

## బాధితులకు కొండంత అండగా నిలవాలి: సఖి వన్ స్టాప్ సెంటర్‌లో డీఎల్ఎస్ఏ సెక్రటరీ స్వాతి మురారి




మహబూబాబాద్ జిల్లా; (సెప్టెంబర్ 29 వేకువ సమయం ప్రతినిధి); మహబూబాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి శ్రీమతి స్వాతి మురారి స్థానిక 'సఖి' (వన్ స్టాప్) కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి కేంద్రంలో బాధితులకు అందుతున్న పునరావాసం, కౌన్సిలింగ్ మరియు న్యాయ సహాయం వసతులను, రిజిస్టర్లను తనిఖీ చేసి సిబ్బంది పనితీరును సఖి కేంద్రం అడ్మినిస్ట్రేటర్ శ్రావణిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం లీగల్ ఎయిడ్ కౌన్సిలర్ ఉష , మానసిక సామాజిక సలహాదారు సరస్వతి మరియు ఇతర సిబ్బందితో ఆమె ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వివిధ సమస్యలతో, గృహహింసతో లేదా ఇతర ఆపదల్లో చిక్కుకుని ఆశ్రయం కోసం కేంద్రానికి వస్తున్న బాధిత మహిళలకు అందిస్తున్న కౌన్సెలింగ్ విధానంపై ఆరా తీశారు. బాధితుల కోసం ఏర్పాటు చేసిన షెల్టర్ హోమ్‌లో వసతులు, భద్రత, పరిశుభ్రత తదితర అంశాలను స్వయంగా పరిశీలించారు. అనంతరం సఖి కేంద్రం నిర్వహిస్తున్న దైనందిన నివేదికలు , కేసుల రికార్డులను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ..ఆపదలో ఉన్న మహిళలు కేంద్రానికి రాగానే తక్షణమే స్పందించి, వారికి అవసరమైన వైద్య, న్యాయ, మరియు పోలీసు సాయాన్ని సత్వరమే అందించాలన్నారు. హింసకు గురైన మహిళలు తీవ్రమైన ఆందోళనలో ఉంటారు కాబట్టి, కౌన్సిలర్లు వారికి పటిష్టమైన కౌన్సెలింగ్ ఇచ్చి మానసిక స్థైర్యం కల్పించాలని సూచించారు. చట్టపరమైన హక్కులపై బాధితులకు అవగాహన కల్పించడంతో పాటు, అవసరమైన వారికి ఉచిత న్యాయ సహాయం అందేలా డీఎల్ఎస్ఏతో నిరంతరం సమన్వయం చేసుకోవాల న్నారు. సమాజంలో మహిళల రక్షణలో సఖి కేంద్రాల పాత్ర అత్యంత కీలకమన్న ఆమె.. ఇప్పటివరకు కేంద్రం సిబ్బంది బాధితులకు అందిస్తున్న సేవలను, వారి పనితీరును ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి ఒక్కరూ భవిష్యత్తులోనూ ఇదే సేవా దృక్పథంతో, అంకితభావంతో విధులు నిర్వర్తించి బాధితులకు మరింత అండగా నిలవాలని ఆమె ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో సఖి కేంద్రం సిబ్బంది స్వాతి, లావణ్య, శోభ తదితరులు పాల్గొన్నారు.

## వరల్డ్ హార్ట్ డే సందర్భంగా కార్డియాలజిస్ట్ చందులాల్ రాథోడ్‌కు ఘన సన్మానం

### బీఎస్పీ పార్టీ షాద్‌నగర్ అసెంబ్లీ ఆధ్వర్యంలో సన్మానం

షాద్‌నగర్: వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ప్రజలలో గుండె ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ, వైద్య రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ చందులాల్ రాథోడ్ గారిని బీఎస్పీ పార్టీ షాద్‌నగర్ అసెంబ్లీ తరఫున ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీఎస్పీ షాద్‌నగర్ అసెంబ్లీ ఇంచార్జి తుప్పరి కుమార్ (TKR-BSP) మాట్లాడుతూ.. గుండె సంబంధిత వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. అధిక రక్తపోటు, మధుమేహం, ఊబకాయం, ధూమపానం, ఒత్తిడి వంటి అంశాలు గుండె ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ప్రజలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ గుండె ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ చందులాల్ రాథోడ్ సేవలను అభినందిస్తూ, ఆయనకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు వైద్యులు చేస్తున్న సేవలు ఎంతో విలువైనవని, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి వైద్యులు-ప్రజలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని తుప్పరి కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు రంగారెడ్డి జిల్లా ఈసీ మెంబర్ జీ బాలయ్య మరియు అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి కొండేటి మహేందర్, కమ్మదనం బూత్ అధ్యక్షులు మొగిలిగిద్ద జయప్రకాష్, పద్మారం సినీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




## పీఎం శ్రీ పాఠశాలలకు ద్విభాషా నిఘంటువుల సరఫరాకు టెండర్ల ఆహ్వానం



నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి సెప్టెంబర్ 29: నాగర్‌కర్నూల్ జిల్లాలోని 23 పీఎం శ్రీ పాఠశాలలకు 7,307 ద్విభాషా నిఘంటువులను సరఫరా చేసేందుకు జిల్లా కొనుగోలు కమిటీ (డీపీసీ ) ఆధ్వర్యంలో సీల్డ్ టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్, జిల్లా కొనుగోలు కమిటీ చైర్మన్ ఆదేశాల మేరకు, రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్, సమగ్ర శిక్ష సూచనల ప్రకారం టెండర్ల ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు డీఈఓ తెలిపారు.టెండర్ దరఖాస్తులను 30.09.2026 నుంచి 02.10.2026 వరకు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో పొందవచ్చని, పూర్తి చేసిన టెండర్ దరఖాస్తులను 02.10.2026లోగా అదే కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. సీల్డ్ టెండర్లను 03.10.2026న మధ్యాహ్నం 3.00 గంటలకు తెరవనున్నట్లు డీఈఓ పేర్కొన్నారు.

టెండర్ల సమర్పణ చిరునామా: జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం, ఐడీఓసీ, గది నం. F14, నాగర్‌కర్నూల్.

అర్హత కలిగిన ఆసక్తి గల సరఫరాదారులు నిర్ణీత గడువులోపు తమ సీల్డ్ టెండర్లను సమర్పించాలని డీఈఓ రమేష్ కుమార్ కోరారు. టెండర్ ఫారమ్ ధర మరియు ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ మొత్తాన్ని "జిల్లా కలెక్టర్ మరియు తెలంగాణ సమగ్ర శిక్ష చైర్‌పర్సన్, నాగర్‌కర్నూల్" పేరుతో డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. టెండర్ ఫారమ్‌లు, నిఘంటువులకు సంబంధించిన సాంకేతిక ప్రమాణాలు, టెండర్ నిబంధనలు, ఇతర వివరాలను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం, ఐడీఓసీ, గది నం. F14, నాగర్‌కర్నూల్‌లో పని దినాల్లో పొందవచ్చని పేర్కొన్నారు. అదేవిధంగా టెండర్ నోటిఫికేషన్, దరఖాస్తు ఫారమ్, ఇతర సంబంధిత వివరాలను జిల్లా విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్‌లో కూడా పొందవచ్చని తెలిపారు. టెండర్ ప్రక్రియకు సంబంధించిన తేదీలను మార్చడం, పొడిగించడం లేదా అవసరమైతే టెండర్ ప్రక్రియను రద్దు చేయడం వంటి పూర్తి అధికారాలు జిల్లా కొనుగోలు కమిటీకి ఉన్నాయని డీఈఓ రమేష్ కుమార్ తెలిపారు.

## మామునూరు ఎయిర్ పోర్ట్‌కు సేవాలాల్ మహారాజ్ పేరు పెట్టాలి

### ఆర్, జీ, ఎస్, డిమాండ్ జిల్లా, అధ్యక్షులు బానోత్ సురేష్ నాయక్

మహబూబాబాద్ జిల్లా: (సెప్టెంబర్ 29 వేకువ సమయం ప్రతినిధి): పునరుద్ధరణ జరుగుతున్న మామునూరు విమానాశ్రయానికి బంజారా సమాజం ఆరాధ్య దైవంగా భావించే, సత్ గరు సేవాలాల్ మహారాజ్ పేరు పెట్టాలని రాష్ట్రీయ గోర్ సేన మానుకోట జిల్లా అధ్యక్షులు బానోత్ సురేష్ నాయక్, డిమాండ్ చేశారు.మామునూరు విమానాశ్రయం ఉత్తర తెలంగాణకు కీలకమైన రాండవో రవాణా కేంద్రంగా అభివృద్ధి చెందనున్న నేపథ్యంలో, ఈ ప్రాంత చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యతలను ప్రతిబింబించే విధంగా విమానాశ్రయానికి పేరు పెట్టాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం కూడా (మామునూరు) విమానాశ్రయాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని కేంద్రాన్ని కోరినట్లు ఆయన పేర్కొన్నారు. సేవాలాల్ మహారాజ్ బంజారా సమాజానికి ఆధ్యాత్మిక, సామాజిక ప్రేరణ క్రాంతి కారి సత్ గరు సేవాలాల్ మహారాజ్ బంజారా సమాజంలో ఆధ్యాత్మిక, సామాజిక చైతన్యానికి ప్రతీకగా నిలిచారని బానోత్ సురేష్ నాయక్ అన్నారు. సమాజంలో ఐక్యత, క్రమశిక్షణ, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ఆయన చేసిన కృషి బంజారా ప్రజలకు స్ఫూర్తిదాయకమని తెలిపారు.బంజారా సమాజ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలకు తగిన గుర్తింపు కల్పించే విధంగా మామునూరు విమానాశ్రయానికి సేవాలాల్ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయం గా పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

**అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి – ప్రాంతానికి కీలక ప్రాజెక్టు**

మామునూరు విమానాశ్రయానికి అవసరమైన భూసేకరణ పూర్తయినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపిందని, విమానాశ్రయ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కేంద్రాన్ని కోరినట్లు ఆయన పేర్కొన్నారు. విమానాశ్రయంలో ప్రయాణికుల సేవలతో పాటు ఎయిర్ కార్గో, ఎంఆర్ఓ (మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్‌హాల్), హ్యాంగర్ తదితర సదుపాయాలు కల్పించే ప్రతిపాదనలు కూడా ఉన్నాయని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా మొత్తం గోర్ బంజారా లు నివసించే ప్రాంతాలు అక్కడ ఉన్న భూములు కూడా గోర్ బంజారా వాళ్లదే అని పేర్కొన్నారు. మామునుర్ విమానాశ్రయం ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాలకు రవాణా పరంగా ఉపయోగకరంగా ఉండనుందని, విమానాశ్రయం అభివృద్ధితో పారిశ్రామిక, వాణిజ్య, పర్యాటక రంగాలకు మరింత అనుసంధానం ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విమానాశ్రయ నిర్మాణాల్లో తెలంగాణ సంస్కృతి, చరిత్ర, శిల్పకళ ప్రతిబింబించేలా డిజైన్లకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించిన నేపథ్యంలో, బంజారా సమాజ చారిత్రక ప్రాధాన్యతను కూడా గుర్తించి సేవాలాల్ మహారాజ్ పేరు పరిశీలించాలని బానోత్ సురేష్ నాయక్ కోరారు. మామునూరు విమానాశ్రయానికి క్రాంతి కారి సత్ గరు సేవాలాల్ మహారాజ్ పేరు పెట్టే అంశంపై అన్ని గోర్ బంజారా సంఘాలు, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాలు కలిసి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలని ఆయన కోరారు.– రాష్ట్రీయ గోర్ సేన నాయకులు

## అభివృద్ధిలో దూసుకుపోతున్న నర్వ మండలం.!



మక్తల్ : మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాలతో అభివృద్ధి పరుగులు.! నాగిరెడ్డిపల్లి-ఉంధ్యాల గ్రామాల మధ్య రూ.4.50 కోట్ల అంచనా వ్యయంతో 3.ఖ.వీ ల 350, మీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ప్రజల రవాణా సమస్యకు పరిష్కారం లభించడంతో పాటు, రైతులకు వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తరలించడం మరింత సులభతరం కానుంది. ప్రజల అవసరాలు గుర్తించి.. నిధులు మంజూరు చేయించి.. పనులు ప్రారంభించేలా కృషి చేస్తున్న మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి కి హృదయపూర్వక కృతజ్ఞతలు.కార్యక్రమంలో పంచాయతి రాజ్ DE ఉపేందర్ రెడ్డి, నర్వ మండలం పీఆఆ శ్రీనివాస్,పీఆ, రాఘవేందర్,AE తరుణ్ రెడ్డి,నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీసం చెన్నయ్య సాగర్, నాగిరెడ్డిపల్లి సర్పంచ్ అంకె భాగ్యమ్మ-చంద్రశేఖర్, ఉపసర్పంచ్ మొగిలన్న, వార్డు సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, మండల నాయకులు జగన్మోహన్ రెడ్డి గారు,ఆత్మకూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, డైరెక్టర్ నరేష్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు శరణప్ప, నాగన్న, వివేకవర్ధన్‌రెడ్డి, బీసం రవి సాగర్, బోయపాటి నర్సింహాతో పాటు వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

## బాల్య వివాహ రహిత భారత్ను నిర్మించుకుందాం!

### బాల్య వివాహం చట్టపరమైన నేరం, వాల్ పోస్టర్స్ విడుదల, గ్రామ సర్పంచ్ పులిపాటి శ్రీనివాసులు




నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి సెప్టెంబర్ 29: తెలకపల్లి మండల పరిధిలోని తాళ్లపల్లి గ్రామంలో మంగళ వారం గ్రామ సర్పంచ్ పులిపాటి శ్రీనివాసులు బాల్య వివాహాలు నిర్మూలన పై వాల్ పోస్టర్స్ విడుదల చేశారు ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని దేవాలయంలో బాల్య వివాహాలు జరుపబడవు , అదేవిధంగా 18 సంవత్సరాల కన్నా తక్కువ వయస్సు ఉన్న అమ్మాయి లేదా 21 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న అబ్బాయి. వివాహం జరుపబడదు. బాల్య వివాహం చేయించడం లేదా అందులో పాల్గొనడం శిక్షార్హమైన నేరం. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేష్ రెడ్డి. సోషల్ వర్కర్ శ్రీనివాస్, గ్రామ పెద్దలు రామచంద్రయ్య, కురుమయ్య, కృష్ణయ్య, తిరుపతయ్య, రామస్వామి సింహయ్య,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు






**ఫార్మర్ రిజిస్ట్రీని వేగవంతం చేయాలి.. 70 శాతం లక్ష్యాన్ని త్వరగా అధిగమించాలి అధికారులకు కలెక్టర్ మను చౌదరి ఆదేశాలు**

**వేకువ సమయం సెప్టెంబర్ 29 కీసర ప్రతినిధి :** మేడ్చల్-మల్కాజిగిరి, సెప్టెంబర్ 29: జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను మరింత వేగవంతం చేసి, త్వరలోనే 70 శాతం లక్ష్యాన్ని అధిగమించాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు పూర్తిచేయాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డితో కలిసి ధాన్యం కొనుగోలు సన్నాహాలు, రైతుల సంక్షేమంపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పౌర సరఫరాలు, వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయాధికారులు (AOs), వ్యవసాయ విస్తరణ అధికారులు (AEOs), కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రతి మండలంలో కొనుగోలు కేంద్రం**

ప్రతి మండలానికి కనీసం ఒక ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన స్థలాలను ముందుగానే గుర్తించి, స్థల సమస్యల కారణంగా కొనుగోళ్లు ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం నిల్వకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ గోదాములు, అదనపు నిల్వ స్థలాలను గుర్తించాలని సూచించారు.

**అవసరమైన సామగ్రి సిద్ధంగా ఉంచాలి**

కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సామగ్రిని ముందుగానే సమకూర్చాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గన్నీ బ్యాగులు, టార్పాలిన్ షీట్లు, సుత్తిలి, మాయిశ్చర్ మీటర్లు, ఆటోమేటిక్ క్లీనింగ్ మిషన్లు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

**రవాణా, గోదాముల వద్ద ఆలస్యానికి చెక్**

కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని గోదాములకు తరలించేందుకు తగినన్ని వాహనాలను సిద్ధంగా ఉంచాలని రవాణా కాంట్రాక్టర్లను ఆదేశించారు. గోదాముల వద్ద ధాన్యం అన్‌లోడింగ్ సమయంలో వాహనాలు ఎక్కువసేపు వేచి ఉండకుండా ముందస్తు సమన్వయం చేసుకోవాలని సూచించారు. కూలీల కొరత కూడా తలెత్తకుండా గోదాముల అధికారులతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు.

**ఆరబెట్టే స్థలాల గుర్తింపు**

ధాన్యంలో తేమ శాతం తగ్గించేందుకు రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి కొనుగోలు కేంద్రాల సమీపంలో అదనపు స్థలాలను గుర్తించాలని కలెక్టర్ సూచించారు. తహసీల్దార్లతో సమన్వయం చేసుకుని ప్రభుత్వ, ప్రైవేట్ ఖాళీ స్థలాలను పరిశీలించాలని ఆదేశించారు.

**అకాల వర్షాలపై అప్రమత్తత**

ఖరీఫ్ సీజన్‌లో అకాల వర్షాల వల్ల ధాన్యం తడవకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. వాతావరణ శాఖ హెచ్చరికలను ఎప్పటికప్పుడు రైతులకు చేరవేసి, ధాన్యాన్ని రక్షించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు తదితర రక్షణ సామగ్రి సిద్ధంగా ఉంచాలని చెప్పారు.

**రైతులతో సానుకూలంగా వ్యవహరించాలి**

ధాన్యం కొనుగోళ్ల సమయంలో ఏవైనా సమస్యలు తలెత్తితే అధికారులు, కేంద్రాల ఇన్‌చార్జులు రైతులతో ఓపికగా, సానుకూలంగా వ్యవహరిస్తూ సమస్యలను శాంతియుతంగా పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను వ్యవసాయ అధికారులు, సిబ్బంది, కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. వారు వెల్లడించిన సమస్యలను పరిష్కరించడంతో పాటు అవసరమైన మేరకు వ్యవసాయ యంత్రాలను అందుబాటులోకి తీసుకువస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో జిల్లా సివిల్ సప్లై డీఎం సుగుణ బాయి, సివిల్ సప్లై అధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ, వ్యవసాయ, పౌర సరఫరాల శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జడ్చర్ల ఎంబి మెడికల్ ఆసుపత్రి కూల్చివేతల పై ఎంపీ డి.కె. అరుణ తీవ్ర ఆగ్రహం

**తక్షణమే ఎంబి ఆసుపత్రి ఆవరణలో కూల్చివేతలు నిలిపివేయాలి మహిళా వైద్యురాలిని భయభ్రాంతులకు గురి చేయడం దుర్మార్గం.**

మహబూబ్ నగర్ : మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలోని జాతీయ రహదారి సమీపంలోని ప్రముఖ 'ఎంబి మెడికల్ ఆసుపత్రి' మరియు నివాస ఆస్తులను కూల్చివేయడం వెనుక కుట్ర దాగుందని మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డి.కె. అరుణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆసుపత్రి కూల్చివేతలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు."దివంగత డాక్టర్ అర్నాల్డ్ కుమార్తె, వైద్యురాలు డాక్టర్ అనురాధ నివాసం, ఆసుపత్రి ప్రాంగణంలో అర్ధరాత్రి వేళ బుల్డోజర్లు చొరబడటం అత్యంత దారుణమని, ఒక నిస్సహాయ మహిళా వైద్యురాలిపై అంగబలం, అధికార బలంతో ఇటువంటి దౌర్జన్యాలకు పాల్పడటం తీవ్రంగా ఖండించదగినది" అని పేర్కొన్నారు. కోర్టును తప్పుదోవ పట్టించి, చట్ట విరుద్ధంగా ఆస్తులను ధ్వంసం చేయడానికి ప్రయత్నిస్తున్నారని బాధిత కుటుంబం తీవ్ర ఆవేదన గురవుతుందని ఆమె గుర్తుచేశారు. డాక్టర్ అనురాధ మరియు వారి కుటుంబ సభ్యుల ప్రాణాలకు ముప్పు పొంచి ఉందనే భావిస్తున్నారని, వారికి పూర్తి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం పోలీసు యంత్రాంగంపై ఉందని స్పష్టం చేశారు. ఏవైనా సమస్యలు ఉంటే.. సామరస్యంగా పరిష్కరించుకోవాలని కానీ అనుచరులు అర్ధరాత్రి పూట భయాందోళనలకు గురిచేస్తే.. సహించేది లేదని హెచ్చరించారు. తక్షణమే అధికారులు స్పందించి ఈ కూల్చివేతలను అడ్డుకోవాలని ఎంపీ డి.కె. అరుణ డిమాండ్ చేశారు.

## గణనాథుని లడ్డూకు రికార్డు ధర.. రూ.2.81 లక్షలు!

**కీసర సర్కిల్‌లోనే అత్యధిక ధరకు బల్దేవ్ గణపతి లడ్డూ వేలం**



వేకువ సమయం సెప్టెంబర్ 29 కీసర ప్రతినిధి : లడ్డూను దక్కించుకున్న బలిజ రఘుపతి రెడ్డి.. వైభవంగా నిమజ్జన శోభాయాత్ర మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా, కీసర : వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భక్తుల విశ్వాసానికి, ఆధ్యాత్మిక ఉత్సాహానికి ప్రతీకగా నిలిచే గణనాథుని లడ్డూ ప్రసాదం వేలం కీసరలో ఘనంగా జరిగింది. స్థానిక బల్దేవ్ వినాయక మండపం వద్ద సోమవారం రాత్రి నిర్వహించిన వేలం పాటలో లడ్డూ ప్రసాదం ఏకంగా రూ.2,81,000 ధర పలికింది. కీసర సర్కిల్ పరిధిలోనే ఈ స్థాయిలో లడ్డూ ధర పలకడం ప్రత్యేకంగా నిలిచింది.వినాయకుడి ప్రసాదాన్ని దక్కించుకునేందుకు భక్తులు, స్థానికులు ఉత్సాహంగా వేలంలో పాల్గొనగా.. చివరకు బలిజ రఘుపతి రెడ్డి రూ.2.81 లక్షలకు లడ్డూను కైవసం చేసుకున్నారు. వేలం ముగిసిన అనంతరం నిర్వాహకులు, భక్తులు ఆయనను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. గణనాథుని ఆశీస్సులతోనే దక్కింది.లడ్డూను దక్కించుకున్న బలిజ రఘుపతి రెడ్డి మాట్లాడుతూ.. గణనాథుని అనుగ్రహంతోనే ఈ పవిత్ర ప్రసాదం తనకు లభించిందన్నారు. స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. గణనాథుని లడ్డూను స్వీకరించడం తన కుటుంబానికి ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు.

**భక్తిశ్రద్ధల మధ్య శోభాయాత్ర**

లడ్డూ వేలం అనంతరం బల్దేవ్ వినాయకుడి నిమజ్జన శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై గణనాథుడి విగ్రహాన్ని ఉంచి భక్తుల జయజయధ్వానాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, భక్తిగీతాలు, యువత నృత్యాలతో కీసర పరిసరాలు సందడిగా మారాయి. శోభాయాత్రలో మహిళలు, యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడికి పూజలు నిర్వహించారు. 'గణపతి బప్పా మోరియా' అంటూ భక్తులు నినాదాలు చేస్తూ నిమజ్జనానికి తరలించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు. రూ.2.81 లక్షల లడ్డూ వేలం.. భక్తుల సందడి.. వైభవమైన శోభాయాత్రతో కీసరలో బల్దేవ్ గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి.

## జిపి వర్కర్స్ కు జీవో నెంబర్ జీరో సిక్స్ ప్రకారం వేతనాలు ఇవ్వాలి: టి యు సి ఐ డిమాండ్



వనపర్తి : జిల్లా కేంద్రంలో TUCI రాష్ట్ర జనరల్ కౌన్సిల్ ఇచ్చిన పిలుపులో భాగంగా Go నెంబర్ 06 ప్రకారంగా Gp వర్కర్స్ కు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని రాజావారి బంగ్లా దగ్గర కరపత్రం విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో TUCI జిల్లా ఉపాధ్యక్షులు C రాజు, తెలంగాణ ప్రగతి శీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎదుట్ల కురుమయ్య, B గణేష్, జిల్లా నాయకులు గట్టమ్మ, గోవిందమ్మ, నిరంజన్, అభి శావాలి,రాణి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం



వేకువ సమయం న్యూస్ మంచిర్యాల సెప్టెంబర్ 29, 2026 : ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని చెన్నూర్ మండల కేంద్రంలో కొనసాగుతున్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి ప్రహరీ గోడ, ఇతర పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం 100 పడకలతో ఆసుపత్రి ఏర్పాటు చేసిందని, నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని తెలిపారు. ఆసుపత్రి ప్రారంభానికి సిద్ధం చేయడం జరుగుతుందని, ప్రజలకు మరింత చేరువలో వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలను సందర్శించి అదనపు గదుల నిర్మాణ పనులు, వంటశాల, తరగతి గదులు పరిసరాలను పరిశీలించారు. విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో పాఠశాలలలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారంతో పాటు నాణ్యమైన విద్యాబోధన అందించాలని, విద్యార్థుల తల్లిదండ్రులలో ప్రభుత్వ విద్యా సంస్థలపై నమ్మకం కల్పించి ప్రభుత్వ పాఠశాలలలో చేర్పించేలా సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి అదనపు గదుల పనులను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో నాణ్యమైన విద్య బోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తహసీల్దార్ మల్లికార్జున్ తో కలిసి గోదావరి పుష్కరాలు 2027 లో భాగంగా గోదావరి పుష్కర ఘాట్ ఏర్పాటు, రహదారుల మరమ్మత్తు, వాహనాల నిలుపుదల, సౌకర్యాల కల్పనపై అధికారులతో సమీక్షించారు. ఈ క్రమంలో రైతులతో మాట్లాడుతూ గోదావరి పుష్కర పనుల నిర్వహణలో రైతులు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు సమగ్ర చర్యలు చేపట్టాలి



మహబూబాబాద్ జిల్లా; (సెప్టెంబర్ 29 వేకువ సమయం ప్రతినిధి) : జిల్లాలో రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి, ప్రయాణికుల భద్రతను మెరుగుపరచడానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ తొ కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోలీస్, ఆర్అండ్‌బి (అర్ & బీ), రవాణా (ఆర్టీవో), నేషనల్ హైవేస్ (ఎన్ హెచ్ ఎ ఐ), పంచాయతీ రాజ్, మున్సిపల్ శాఖల అధికారులతో "రోడ్డు భద్రత & ప్రమాదాల నివారణ"పై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్బంగా కలెక్టర్ అధికారులు అందరూ బాధ్యతాయుతంగా పనిచేసి జిల్లాను రోడ్డు ప్రమాద రహితంగా తీర్చిదిద్దాలని అన్నారు. శాశ్వత నివారణ: జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను (బ్లాక్ స్పోర్ట్స్) తక్షణమే గుర్తించి రోడ్డు ఇంజనీరింగ్ లోపాలను సరిచేయాలి. డేంజర్ జోన్లు, మలుపుల వద్ద స్పష్టమైన హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, రేడియంట్ స్టిక్కర్లు, కేట్ ఐస్ ఏర్పాటు చేయాలన్నారు.హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోవడం, అతి వేగం, డ్రంక్ అండ్ డ్రైవ్‌లపై కఠిన తనిఖీలు చేపట్టాలి. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తప్పవని, పరిమితికి మించి లోడ్ (ఓవర్ లోడింగ్), తో వెళ్లే వాహనాలపై భారీ జరిమానాలు విధించాలని అన్నారు.వర్షాల వల్ల రోడ్లపై ఏర్పడిన గోతులను తక్షణమే పూడ్చివేయాలి. రాత్రి వేళల్లో రహదారులపై తగినంత వెలుతురు ఉండేలా వీధి దీపాల నిర్వహణను మెరుగుపరచాలి. ప్రధాన రహదారుల పక్కన అక్రమంగా పార్క్ చేసే వాహనాలపై ఆర్‌టీఓ, ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు.పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్లలో విద్యార్థులకు, ప్రజలకు రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన సదస్సులు నిర్వహించాలి. ఆటో, క్యాబ్, లారీ డ్రైవర్లకు సురక్షిత ప్రయాణ నియమాలపై కౌన్సెలింగ్ ఇవ్వాలని, ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించేలా 108 అంబులెన్స్ సేవలను అనుసంధానించాలని, రహదారులకు సమీపంలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులను ఎల్లప్పుడూ అత్యవసర సేవల కోసం సిద్ధంగా ఉంచాలని వైద్యారోగ్య శాఖను ఆదేశించారు.ప్రతి నెలా అన్ని శాఖల అధికారులు సమావేశమై రోడ్డు భద్రత పురోగతిపై సమీక్ష జరపాలని స్పష్టం చేశారు.జిల్లాలో ఎక్కువగా మరిపెడ, తొర్రూరు, గూడూర్, మండలలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, మరిపెడ జాతీయ రహదారి నెంబర్ 365, 563, పై సమస్యలు గుర్తించమని కేవలం మరిపెడ లో (13) మంది చనిపోయారని, అలాగే కాంపెల్లి, కందికొండ, ఉప్పరి గూడెం, నల్లెల, తొర్రూరు పాలకేంద్రం జంక్షన్, టౌన్, గూడూరు మండల కేంద్రం, భూపతిపేట, దామరవంచ, బొద్దుగొండ, వద్ద హై టెంక్షన్ వైర్ల, సమస్యలు, మహబూబాబాద్ టౌన్, బెతోల్, తల్లపుసపల్లి, కురవి ఏకవలవ్య స్కూల్, బయ్యారం జాతీయ రహదారి 930 పి, పై సాయిబాబా, టెంపుల్, సత్యనారాయణపురం, కొత్తపేట, గంధంపల్లి, లలో సమస్యల పరిష్కారం కోసం వెంటనే ప్రత్యేక చర్యలు తీసుకోవాలని,భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా జాగ్రత్తగా ప్రయాణం చేసే విధంగా అవగాహన కల్పించే బాధ్యత సంబంధిత అధికారులు తీసుకోవాలని కోరారు.రహదారులపై సంతలు,( అంగడి) నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని, హైవే పై ప్రత్యేక వాహనాలు పెట్రోలింగ్ నిర్వహించాలని, అంబులెన్స్ లు అందుబాటులోకి ఉంచుకోవాలని సూచించారు. రహదారుల వెంబడి స్థలాలను ఆక్రమించకుండా చర్యలు తీసుకోవాలని, బిల్డింగ్ పర్మిషన్లను తనిఖీ చేయాలని, అన్ని విభాగాలకు సంబంధించి రోడ్డు భద్రత అంశాలపై ఎలాంటి నిధులు అవసరమున్న వెంటనే నివేదికలు తయారుచేసి వారం రోజులుగా పంపాలని కలెక్టర్ సంబంధిత అధికారులు ఆదేశించారు, రోడ్డు భద్రత తదితర అంశాలపై పిల్లలు ప్రజల్లో విస్తృత అవగాహన ప్రచారం కల్పించాలని తెలిపారు, అన్ని విభాగాల సంబంధిత అధికారులు జాయింట్ యాక్షన్ ప్లాన్ ప్రకారం నివేదికలు రెడీ చేసి తీసుకోవలసిన జాగ్రత్తలపై యాక్షన్ టేకెన్ రిపోర్టు ఇవ్వాలని, జాతీయ రహదారుల వెంబడి నిబంధనల మేరకు మద్యం దుకాణాలను అనుమతి ఇవ్వాలని అన్నారు, జిల్లాలో రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి పోలీసు శాఖ తరఫున నిరంతర నిఘా మరియు కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.హెల్మెట్ లేకుండా ప్రయాణించే వారిపై, సీట్ బెల్ట్ ధరించని వారిపై, అతివేగం (ఓవర్ స్పీడింగ్) మద్యం తాగి వాహనాలు నడిపే (డ్రంక్ అండ్ డ్రైవ్) వారిపై రాజీ లేని తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వాహన యజమానులతో పాటు వారి తల్లిదండ్రులపై చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పరిమితికి మించి లోడ్‌తో వెళ్లే (ఓవర్ లోడింగ్) లారీలు, ట్రాక్టర్లు ప్రమాదాలకు ప్రధాన కారణమవుతున్నాయని, అలాంటి వాహనాలపై భారీ జరిమానాలు విధించాలని అధికారులను ఆదేశించారు. రహదారుల పక్కన, జాతీయ రహదారులపై అక్రమంగా వాహనాలను నిలిపివేస్తే ఆర్, టి, ఓ, ట్రాఫిక్ పోలీసులు వెంటనే క్రేన్ల సహాయంతో తొలగించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.డ్రైవర్లను సమూహాలుగా చేసి వారి ప్రవర్తనలో మార్పు వచ్చేలా, రోడ్డు నియమాలు పాటించేలా పోలీసు స్టేషన్ల వారీగా ప్రత్యేక కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి తమ విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని, పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె. అనిల్ కుమార్, ఇన్చార్జి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు హౌసింగ్ పీడీ పురుషోత్తం, ఆర్ అండ్ బి ఈఈ రాజు, డీఎస్పీ తిరుపతి రావు, డిఆర్ఓ నాగలక్ష్మి,ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్, నేషనల్ హైవే పిడి,పిఆర్, ఆర్ అండ్ బి, ఈ ఈ లు, డిస్ట్రిక్ట్ ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్, డివిహెచ్ఓ డాక్టర్ కిరణ్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్, ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రమేష్, ఎస్సీ ఎస్టీ, మైనార్టీ, సంక్షేమ శాఖ అధికారులు, ఆర్సిఓ లు, ఇంటర్ మీడియట్ అధికారి మదర్, ఎక్సైజ్, పోలీస్, అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, డిపిఓ రేవంత్, సంబంధిత అన్ని విభాగాల అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు రాజేష్, తదితరులు పాల్గొన్నారు.





**కళ్లలో మెరుపు.. పెదవులపై చిరునవ్వు.. వెండితెరపై బోల్డ్ నటన.. ఇదీ మనం చూసే పాయల్ రాజ్‌పుత్. కానీ ఆ గ్లామర్ వెనుక ఒక సామాన్య అమ్మాయి పడిన ఆవేదన ఉంది. అవకాశాల కోసం ఎదురుచూపులు.. ఆత్మీయుల దూరం.. ఒంటరి పోరాటం.. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాయల్ కన్నీరు పెట్టుకున్న తీరు ఆమెలోని సున్నితమైన కోణాన్ని ఆవిష్కరించింది.**

సమయం ప్రతినిధి

# కుటుంబం కోసమే సినిమాల్లోకి

సాధారణంగా సెలబ్రిటీల ఇంటర్వ్యూలంటే సినిమాల గురించి, గ్లామర్ గురించి సాగుతాయి. కానీ పాయల్ రాజ్‌పుత్ ఇటీవల ఒక ఇంటర్వ్యూ ప్రశంసలతో మొదలై, కన్నీళ్లతో ముగిసింది. ఆమె మేధస్సును, నైపుణ్యాన్ని ఇంటర్వ్యూయర్ మెచ్చుకున్నప్పుడు ఆమె ఆశ్చర్యపోయారు. ఎందుకంటే గ్లామర్ ప్రపంచంలో నటీమణుల లోపలి ప్రతిభను గుర్తించేవారు చాలా తక్కువమంది ఉంటారు. తన మనసులోని భావాలను ఏమాత్రం ఫిల్టర్ లేకుండా చెప్పే పాయల్.. ఆ మాటలకు ఫిదా అయ్యారు. "మీరు చేస్తున్న పాత్రల కంటే మెరుగైనవి రావాలని మీకు అనిపించడం లేదా?" అన్న ప్రశ్నకు ఆమె చెప్పిన సమాధానం ఆమెలోని పరిణితిని తెలియజేసింది.

## మూస పాత్రల ముద్ర

'ఆర్ఎక్స్ 100' సినిమాతో ఒక వెలుగు వెలిగిన పాయల్.. ఆ తర్వాత అదే తరహా పాత్రలకు పరిమితం కావడంపై తన అసహనాన్ని బయటపెట్టారు. "మనల్ని ఒకే రకమైన మూస పాత్రలకి పరిమితం చేస్తున్నప్పుడు మనం దానికి అలవాటు పడాలి. ఎందుకంటే నటులందరికీ అన్నింటిపై నియంత్రణ ఉండదు" అని ఆమె నిష్కర్షగా చెప్పారు. చిత్ర పరిశ్రమలో ఒక నటి జీవితం ఎంత కఠినంగా ఉంటుందో వివరిస్తూ.. "ఒక నటి ప్రతి రోజు అనిశ్చితితోనే నిద్ర లేస్తుంది. మాకు సరైన కాల్స్ వస్తాయా? రాబోయే మంచి అవకాశం కోసం ఇప్పుడున్న అవకాశాన్ని వదులుకోవాలా? ఒకవేళ వదులుకున్నాక అసలు అవకాశం రాకపోతే ఏం చేయాలి?" వంటి సందేహాల మధ్య నిరంతర యుద్ధం జరుగుతూనే ఉంటుందని ఆవేదన వ్యక్తంచేశారు.

## తండ్రి మరణం

పాయల్ జీవితంలో గత ఏడాదిన్నర కాలం అత్యంత విషాదభరితమైనది. దాదాపు 8 నెలల కిత్రం క్యాన్సర్ కారణంగా తన తండ్రిని కోల్పోవడం ఆమెను మానసికంగా కుంగదీసింది. ఆ విషయాల గురించి పంచుకుంటూ కన్నీరు మున్నీరయ్యారు. "నా తండ్రి చివరి మాటలు నా చెవుల్లో ఇప్పటికీ మార్మోగుతున్నాయి. 'నువ్వు నీ కలలను వెంబడించాలి, ఇక్కడే ఆగిపోకూడదు. క్యాన్సర్ నన్ను తీసుకెళ్తోంది కానీ, నీపై నాకున్న ప్రేమను కాదు' అని ఆయన చెప్పిన మాటలు నాలో మళ్లీ ధైర్యాన్ని నింపాయి" అని పాయల్ గుర్తు చేసుకున్నారు. ఆ బాధ నుంచి కోలుకుని 'లీడర్' వంటి సినిమాలతో కెరీర్‌ను తిరిగి ప్రారంభించారు.

## తమిళ ఎంట్రీ

చాలాకాలం విరామం తర్వాత పాయల్ తమిళ చిత్ర పరిశ్రమలోకి 'లీడర్' సినిమాతో అడుగుపెట్టారు. వ్యాపారవేత్త లెజెండ్ శరవణన్ నటించిన ఈ చిత్రంలో ఆమె పాత్ర నిడివి తక్కువే అయినప్పటికీ తనదైన ముద్రవేశారు. "ఒక సినిమా హీరో చుట్టూ తిరగవచ్చు. అది తప్పు కాదు. కానీ ఆ సినిమా విజయం అందులో పనిచేసే ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఇస్తుంది" అని పరిణతితో సమాధానం ఇచ్చారు. తాను చాలా చిత్ర పరిశ్రమల్లో పనిచేశానని చెప్పిన పాయల్.. భాష రాకపోయినా 'వన్‌టేక్' కళాకారుడిగా పేరు తెచ్చుకోవడానికి ప్రతి పదం అర్థాన్ని రాసుకుని ప్రాక్టీస్ చేస్తానని చెప్పారు. తెలుగులో 'మంగళవారం' అందించిన ఘన విజయం పాయల్ కెరీర్‌కు మళ్లీ ప్రాణం పోసింది. ప్రస్తుతం ఆమె తెలుగులోకి కొన్ని క్రేజీ ప్రాజెక్టుల్లో భాగమయ్యారు. ప్రస్తుతం గ్లామర్‌ను పక్కనపెట్టి ప్రయోగాలకు సిద్ధమవుతున్నారు. లేడీ ఓరియెంటెడ్ కథలకు కూడా ఆమె సై అంటున్నారు.

## సోషల్ మీడియా ఒక ఆశ

కొవిడ్ తర్వాత ప్రేక్షకులను థియేటర్లకు తీసుకురావడం కష్టంగా మారిన తరుణంలో సోషల్ మీడియా ఒక గొప్ప వేదికగా మారిందని పాయల్ అభిప్రాయపడ్డారు. ఒకప్పుడు 'ఇంట్రావర్ట్'గా ఉన్న ఆమె ఇప్పుడు తన భావాలను సోషల్ మీడియా వేదికంగా పంచుకుంటున్నారు. ఇది పర్సనల్ గ్రోత్ కోసమే కాకుండా సినిమా ప్రమోషన్లకు కూడా ఎంతో అవసరమని చెప్పారు. సోషల్ మీడియాలో దొరికే ఆత్మీయత, వివిధ సంస్థలతో కొలాబరేషన్స్ ద్వారా వచ్చే వస్తువులు, దుస్తులు వంటివాటిని తాను దైవికమైన వరంగా భావిస్తానని ఆమె ఆనందం వ్యక్తంచేశారు.

## విపాసనతో మనశ్శాంతి

గత పదేళ్లుగా అస్థిరత, యాంగ్జైటీ (ఆందోళన)తో పోరాడుతున్న పాయల్ ఇటీవల 'విపాసన' కోర్సు చేశారు. అది తన ఆలోచనలను నియంత్రించుకోవడానికి, ప్రజలను ఉన్నది ఉన్నట్టుగా అంగీకరించడానికి సాయపడుతుందని చెప్పారు. ఒకప్పుడు ఒక్క రోజు పని లేకపోయినా సమయం వృథా చేస్తున్నానని బాధపడే పాయల్ ఇప్పుడు నిశ్శబ్దంగా తనతో తాను సమయం గడపడం నేర్చుకున్నారు. "నేను నా కుటుంబాన్ని పోషించడం కోసమే ఈ పరిశ్రమలోకి వచ్చాను. ఇప్పటికీ దీనికే నా ప్రాధాన్యం" అని పాయల్ చెప్పుకొచ్చారు.

## అండర్ రేటెడ్ నటిగా మిగిలిపోవాలా?

పాయల్‌ను చాలామంది ఒక 'అండర్ రేటెడ్' నటిగా చూస్తారు. తెలుగు సినిమాల్లో ఎందుకు కనిపించడం లేదు? అని అడిగే అభిమానులకు ఆమె వద్ద సూటి సమాధానం ఉంది. "నాకు పెద్దగా అవకాశాలు రావడం లేదు. బహుశా నన్ను చూసి ఇండస్ట్రీ జనాలు భయపడుతున్నారేమో" అని ఆమె చమత్కరించారు. అయినప్పటికీ సరైన ప్రాజెక్ట్ కోసం వేచి చూస్తానని, కుదిరితే సరే.. లేదంటే తన దారి తాను వెతుక్కుంటానని ధీమాగా చెప్పారు.

# విద్యాలయాలా... మృత్యునిలయాలా?



**సమయం ప్రతినిధి:** హర్యానాలోని కురుక్షేత్ర జాతీయ సాంకేతిక విద్యాసంస్థలో కేవలం రెండు నెలల్లోనే తెలంగాణకు చెందిన అమ్మోగ్ శివ, హర్యానాకు చెందిన పవన్ కుమార్, ప్రియాంశు, బిహార్‌కు చెందిన దీక్షా దూబే ప్రాణాలు కోల్పోయారు. ముంబై భారతీయ సాంకేతిక విద్యాసంస్థలో నమన్ అగర్వాల్ మరణించాడు. కాన్పూర్‌లో ఒకే ఏడాదిలో మూడు ఆత్మహత్యలు నమోదయ్యాయి. గోవా బిట్స్ పిలానీ క్యాంపస్‌లో పదిహేను నెలల్లో ఆరు మరణాలు నమోదయ్యాయి. కేరళలో ధనుష్ డి, కన్నూర్‌లో దళిత విద్యార్థి నితిన్ రాజ్, వరంగల్‌లో హృతిక్ సాయి వంటి ఘటనలు బయటకు వచ్చాయి. వార్తల్లోకి రాని ఎన్నో మరణాలు ఇంకా చీకట్లోనే ఉన్నాయి. రోహిత్ వేముల నుంచి నితిన్ రాజ్ వరకు.. కులం ఇంకా క్యాంపస్ గోడల మధ్య వెంటాడుతూనే ఉంది. ప్రాజెక్టుల కేటాయింపులో, ఇంటర్న్‌షిప్ అవకాశాల్లో, మార్కుల మూల్యాంకనంలో, పరిశోధన అవకాశాల్లో విద్యార్థిని వివక్ష మానసికంగా కుంగదీస్తోంది. 'మెరిట్' అనే ముసుగులో కులం ఇంకా బతికే ఉంది. రెండువేల పద్నాలుగు నుంచి రెండువేల ఇరవై ఒకటి మధ్య భారతీయ సాంకేతిక విద్యాసంస్థలు, భారతీయ నిర్వహణ విద్యాసంస్థలు, కేంద్ర విశ్వవిద్యాలయాల్లో ఆత్మహత్య చేసుకున్న 122 మందిలో ఇరవై నలుగురు ఎస్సీలు, ముగ్గురు ఎస్టీలు, 41 మంది వెనుకబడిన బీసీ వర్గాలకు చెందినవారు. ఇది వివక్ష, ఒత్తిడి, సామాజిక అవమానాల కలయిక. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే–ఈ వరుస మరణాలపై పౌర సమాజం మౌనం పాటించడం. విద్యార్థి సంఘాలు, ప్రజాస్వామ్యవాదులు, మేధావులు, ఉపాధ్యాయ సంఘాలు, మానవ హక్కుల సంస్థలు దేశవ్యాప్తంగా ఒక్కటై గళమెత్తాల్సిన సమయంలో నిశ్శబ్దంగా ఉండటం మరింత ప్రమాదకరం. ఒకప్పుడు ఒక్క రోహిత్ వేముల మరణం దేశవ్యాప్తంగా ఉద్యమాలను రగిలించింది. అంతకంటే ముందే డీమ్డ్ విశ్వ విద్యాలయాల్లో అవినీతికి, క్యాపిటేషన్ ఫీజుల పెంపుదలకు వ్యతిరేకంగా, మండల్ రిజర్వేషన్లకు మద్దతుగా, విద్యా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా బలమైన విద్యార్థి ఉద్యమాలు వచ్చాయి. విద్యార్థి సమస్యలపై క్యాంపస్‌లు మంటలెక్కాయి. కానీ, నేడు అలాంటి ఉద్యమాలు కనిపించడం లేదెందుకు? విద్యార్థి సంఘాలు విద్యారంగ సమస్యలపై స్వతంత్ర పోరాటాలు చేయడం మానేశాయి. అవి రాజకీయ అనుబంధాల నీడలో చిక్కుకుపోయాయి. ఏ పార్టీకి అనుబంధమో ఆ పార్టీ దిశానిర్దేశంలోనే కదులుతున్నాయి. ఆ రాజకీయ పార్టీలకు ప్రజా సమస్యల కంటే అధికార రాజకీయాలే ముఖ్యం. రేపు పొత్తులు పెట్టుకోవాల్సి వస్తుందనే లెక్కలతో అధికార పార్టీలకు వ్యతిరేకంగా విద్యార్థి ఉద్యమాలకు పిలుపునివ్వడం లేదు. ఫలితంగా విద్యార్థి ప్రాణాలు పోతున్నా, క్యాంపస్‌లు మౌనంగా మారుతున్నాయి. ప్రతి మరణం తర్వాత కేంద్ర బృందాలు వస్తాయి. నివేదికలు అడుగుతాయి. కమిటీలు వేస్తాయి. కానీ అవి తాత్కాలిక స్పందనలు మాత్రమే. శాశ్వత పరిష్కారం కోసం నిర్మాణాత్మక సంస్కరణలు రావాలి. రోహిత్ వేముల చట్టం న్యాయమైన డిమాండే కానీ, చట్టం ఒక్కటే ప్రాణాలను కాపాడదు. పాలకుల్లో చిత్తశుద్ధి లేకపోతే చట్టాలు కాగితాలకే పరిమితమవుతాయి. ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం, యాంటీ ర్యాగింగ్ నిబంధనలు, యూజీసీ మార్గదర్శకాలు ఉన్నా, అమలు సరిగా జరగడం లేదు. కొత్త చట్టం కంటే, ఉన్న చట్టాలను అమలు చేసే సంకల్పమే ఇప్పుడు ముఖ్యం. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునే ధైర్యం, ఉద్యమాల ఒత్తిడి, సమాజం పర్యవేక్షణ, ఇవి లేకపోతే ఇంకో చట్టం కూడా మరో రోహిత్‌ను కాపాడలేని నిర్జీవ అక్షరాలుగానే మిగిలిపోతుంది. క్యాంపస్‌లలో కుల, లింగ, ప్రాంతీయ వివక్షను నేరంగా గుర్తించి, కఠిన చర్యలు తీసుకునే చట్టపరమైన రక్షణలు తప్పనిసరి. థోరట్ కమిటీ సిఫార్సులు పూర్తిగా అమలు చేయాలి. ప్రతి విద్యాసంస్థలో ప్రత్యేక మానసిక ఆరోగ్య బడ్జెట్ ఉండాలి. కౌన్సెలింగ్ కేంద్రాలు నిజంగా పనిచేయాలి. విద్యార్థి హాజరు తగ్గినా, గ్రేడ్‌లు పడిపోయినా వెంటనే స్పందించే ఎర్లీ వార్నింగ్ సిస్టమ్ ఉండాలి. మెంటార్ వ్యవస్థ కాగితాలకే పరిమితం కాకుండా నిజంగా పనిచేయాలి. ఒక విద్యార్థి మరణిస్తే ఆ సంస్థ డైరెక్టర్, వార్డెన్, విభాగాధిపతి, సంబంధిత మెంటార్‌లపై పరిపాలనా విచారణ తప్పనిసరి చేయాలి. వివక్ష చూపిన ప్రొఫెసర్లను సర్వీస్ నుంచి తొలగించేంత కఠిన చర్యలు ఉండాలి.

# కొనసాగుతున్న 'కల్లోలం'

సాయుధ దళాల ప్రత్యేకాధికారాల చట్టం (ఎఎఫ్ఎస్‌పిఎ) అమలును మరో ఆర్నెల్లపాటు మణిపూర్‌లో పొడిగించి, కల్లోలిత ప్రాంతంగా దాని గుర్తింపును కొనసాగించాలని రెండురోజులు క్రితం కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయం క్షేత్రస్థాయి పరిస్థితులకు అద్దం పడుతోంది. మరో విధంగా చెప్పాలంటే, మణిపూర్‌ను దారికి తీసుకురావడంలో తాము విఫలం చెందామని పాలకులు అంగీకరించినట్టు. రాష్ట్రంలో పరిస్థితులు గాడినపడుతున్నాయని, శాంతి స్థాపన దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయన్న వాదన ఈ చర్యతో వీగిపోయింది. అక్టోబర్ 1 నుంచి అమలులోకి రాబోతున్న ఈ నిర్ణయం ఓ ఐదు జిల్లాల్లోని 13 పోలీస్‌స్టేషన్ల పరిధికి మాత్రమే వర్తించదు. అంటే, మిగతా రాష్ట్రమంతా అశాంతిలో కొట్టుమిట్టాడుతున్నదని కేంద్రప్రభుత్వమే అంగీకరించింది. మరో ఆర్నెల్లవరకూ పరిస్థితులు దారికి రావనీ, తేవడం కష్టమని కూడా పాలకులు అనుకున్నట్టుంది. కుకీలకు ఆహారసరఫరాలు సాగకుండా నాగాలు అమలుచేసిన జాతీయ రహదారుల నిర్బంధాన్ని వమ్ముచేశామని మణిపూర్ ప్రభుత్వం సోమవారం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. కుకీ మహిళా సంస్థ ఒకటి సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ వివరణ ఇచ్చుకుంది. కుకీ గ్రామాలకు సరఫరాలు యథావిధిగా సాగేట్టుగా చేశామన్న ఆ వాదనలో నిజమెంతో తెలియదు కానీ, ముగ్గురు నాగాలను కుకీలు హత్యచేసినందుకు నిరసనగా కొన్ని జిల్లాల్లో అక్కడ బంద్ జరుగుతోంది. అసలే, నాగా కుకీల మధ్య ఉద్రిక్తత తీవ్రంగా ఉన్న స్థితిలో, మూడురోజుల క్రితం నాగా తెగకు చెందిన నలుగురు తుపాకీగాయాలతో చనిపోయి కనిపించారు. మయన్మార్‌నుంచి సరిహద్దుదాటివచ్చిన కుకీ మిలిటెంట్లే ఈ ఘాతుకానికి పాల్పడ్డారని, మరణించినవారంతా నిరాయుధులు, నిరుపేదలేనని నాగాలు అంటున్నారు. కుకీ నేషనల్ ఆర్మీ సభ్యులు ఈ ఘాతుకానికి పాల్పడ్డారని నాగా సంఘాల ఆరోపణ. దీనికి కొద్దిరోజుల ముందు, కుకీలమీద నాగాలు జరిపిన దాడిలో ఒక మహిళ సహా నలుగురు మరణించారు. 1992–97మధ్య నాగా–కుకీ ఘర్షణల్లో కన్నుమూసినవారి స్మారకార్థం కుకీలు బ్లాక్‌డే పాటించినందుకు నాగాలకు ఈ ఆగ్రహం కలిగింది. కుకీలు బలంగా ఉన్న గ్రామాల్లో నాగాలు, నాగాలు మెజారిటీగా ఉన్న చోట కుకీలు హత్యలకు గురికావడం ఒక విషవలయంగా కొనసాగుతోంది. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం ఏమీచేయలేదనో, ఏర్పాట్లు సరిగా లేవనో ఎవరూ అనడం లేదు. కానీ, ఈ విషపూరిత వాతావరణాన్ని ఛేదించే విషయంలో పాలకులు విఫలమైనారు. వివిధ పేర్లతో పెద్దసంఖ్యలో సైనికబలగాలు ఉండికూడా హింస నిరంతరాయంగా సాగిపోతోంది. 2023మేనెలలో ఆరంభమై, బీరన్‌సింగ్ ఏలుబడిలో మీతీ––కుకీల మధ్య రెండున్నరేళ్ళకు పైగా కొనసాగిన హింస రాష్ట్రాన్ని అతలాకుతలం చేసింది. బీరేన్ ప్రోద్బలంతో, మీతీల పక్షాన కుకీలమీద పోలీసు బలగాలు, మీతీ తీవ్రవాద సంస్థలు భయానకమైన దాడులకు పాల్పడ్డాయి. ఆ ఘర్షణల్లో మూడువందలమందికి పైగా మరణించారు, 70వేల మంది నిరాశ్రయులైనారు. బీరేన్ పెంచిపోషించిన ఈ హింస, ఇప్పుడు తదనంతర ముఖ్యమంత్రి ఖేమ్‌చంద్ నాయకత్వంలో నాగా––కుకీ వైపు మళ్ళింది. మీతీలకు ఎస్టీ రిజర్వేషన్ కల్పించే బీరేన్ ప్రయత్నం ఒకటి అప్పటి అగ్గిరాజేస్తే, ఇప్పుడు వైరాలు వైషమ్యాలు భూమి చుట్టూ తిరుగుతున్నాయి. బీరేన్ నిష్క్రమణతో రాష్ట్రం గాడినపడుతుందన్న నమ్మకం ఖేమ్‌చంద్ అధికారంలోకి వచ్చిన రెండునెలల్లోనే కొట్టుకుపోయింది. ప్రస్తుత నాగా––కుకీ వైరం వెనుక కూడా ఏవో రాజకీయ కుట్రలు ఉన్నాయన్న విమర్శలను అటుంచితే, అప్పట్లో మాదిరిగా గ్రామాలకు గ్రామాలు తగలబడిపోవడం,




తెలుగు, తమిళ చిత్రసీమల్లో తమదైన కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను విశేషంగా అలరిస్తున్న ప్రముఖ నటులు సత్య, యోగి బాబు ప్రధాన పాత్రల్లో ఓ ఆసక్తికరమైన చిత్రం రూపుదిద్దుకుంటోంది . ఈ చిత్రానికి గోల్డెన్ భాగ్యం అనే క్రేజీ టైటిల్‌ను ఖరారు చేస్తూ చిత్రబృందం మంగళవారం అధికారిక టైటిల్ టీజర్‌ను విడుదల చేసింది. రంగబలి చిత్రంతో దర్శకుడిగా తనదైన ముద్ర వేసిన పవన్ బాసంశెట్టి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తోండగా.. డ్రీమ్ మూవీ మేకర్స్, నయావాయు చిత్రాలు పతాకాలపై డాక్టర్ నాగార్జున రెడ్డి పలువాయి, శ్రీకాంత్ రెడ్డి బాసిరెడ్డి, బాపిరెడ్డి పదాల సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా విడుదలైన టైటిల్ టీజర్ అత్యంత వినోదాత్మకంగా, ఎనర్జెటిక్‌గా సాగింది. తెలుగు,తమిళ సినీ వర్గాలను కలిపే కాన్సెప్ట్‌తో తెలుమిల్ మూవీగా దీనిని పరిచయం చేయడం విశేషం. సాంబార్ ఇడ్లీ, బిర్యానీ కలిస్తే ఎలా ఉంటుందో ఈ సినిమాలో చూస్తారని మేకర్స్ తెలిపారు. ఈ టీజర్‌లో సత్య, యోగి బాబు కలిసి చేసిన సందడి, వారి మధ్య వచ్చిన వినోదాత్మక సంభాషణలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. కామెడీతో పాటు క్రైమ్, యాక్షన్, లవ్ ఎలిమెంట్స్ కూడా ఈ సినిమాలో ప్రధానాంశాలుగా ఉండబోతున్నాయని టీజర్ ద్వారా స్పష్టమవు తోంది. పవన్ సి.హెచ్, నితీష్ జాన్ అందిస్తున్న నేపథ్య సంగీతం , బబ్లూ అజు ఛాయాగ్రహణం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణ గా నిలవనున్నాయి. ఈ చిత్రాన్ని రాబోయే సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు మేకర్స్ ప్రకటించారు. కామెడీ పవర్ హౌస్‌లుగా గుర్తింపు పొందిన సత్య, యోగి బాబు జోడీగా వస్తుండటంతో ఈ సినిమాపై సినీ వర్గాల్లోనూ, ప్రేక్షకుల్లోనూ మంచి అంచనాలు నెలకొన్నాయి. మరి ఈ సినిమాతో యోగిబాబు తెలుగులో ఎలాంటి విజయాన్ని అందుకుంటాడో చూడాలి.




మలయాళీ ముద్దుగుమ్మ అనశ్వర రాజన్ అనువాద చిత్రాలతో తొలుత తెలుగువారి ముందుకొచ్చింది. ఆమె నటించిన 'రేఖాచిత్రం' ఓటీటీలో సూపర్ డూపర్ హిట్ అయ్యింది. దాంతో తెలుగులోనూ ఆమెకు అవకాశాలు వచ్చాయి. అలా గత యేడాది డిసెంబర్ 25న అనశ్వర రాజన్ నటించి స్ట్రయిట్ తెలుగు సినిమా 'ఛాంపియన్' విడుదలైంది. శ్రీకాంత్ తనయుడు రోషన్ మేకా హీరోగా నటించిన ఈ సినిమా కమర్షియల్‌గా సక్సెస్ కావడంతో పాటు అవార్డులనూ అందుకుంది. హీరో రోషన్ గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డులలో స్పెషల్ జ్యూరీ అవార్డుకు ఎంపికయ్యాడు. 'ఛాంపియన్' లో తొలిసారి జంటగా నటించిన రోషన్, అనశ్వర రాజన్ ఇప్పుడు ఒకరితో ఒకరు పోటీ పడబోతున్నారు. రోషన్ మేకా హీరోగా నటించిన 'ఏమో ఏమో ఇది' సినిమా అక్టోబర్ 30న విడుదల కాబోతోంది. శైలేష్ కొలను దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ప్రీతి ముకుందన్ హీరోయిన్. ఈ చిత్రాన్ని సితార ఎంటర్ టైన్ మెంట్స్ సంస్థ నిర్మించింది. అలానే అనశ్వర రాజన్ నటించిన రెండో తెలుగు సినిమా 'ఇట్లు అర్జున' కూడా అక్టోబర్ నెల 30న జనం ముందుకు వస్తోంది. ప్రముఖ దర్శకుడు వెంకీ కుడుమల నిర్మించిన ఈ సినిమాతో మహేశ్ ఉప్పల డైరెక్టర్ గానూ, అనీశ్ హీరోగానూ పరిచయం అవుతున్నారు. విశేషం ఏమంటే అనశ్వర తొలి తెలుగు చిత్రంగా 'ఛాంపియన్' విడుదలైనా, ఆమె అంగీకరించిన మొదటి తెలుగు సినిమా 'ఇట్లు అర్జున'! ఇప్పుడు ఆమె తన ఫస్ట్ ఫిల్మ్ హీరో రోషన్ మూవీ 'ఏమో ఏమో ఇది'తో పోటీ పడబోతోంది. మరి అక్టోబర్ 30న వస్తున్న ఈ రెండు సినిమాలు ఏ స్థాయి విజయాన్ని అందుకుంటాయో చూడాలి.




గ్లోబల్ స్థాయిలో భారీ ఆదరణ పొందిన పాపులర్ రియాలిటీ షో ది ట్రేటర్స్ ఇప్పుడు తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. హను-మాన్ సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో ఘన విజయం సాధించి స్టార్ డమ్ సొంతం చేసుకున్న యంగ్ హీరో తేజ సజ్జ ఈ ప్రతిష్టాత్మక షోకి హోస్ట్‌గా వ్యవహరిస్తున్నాడు. ఈ విషయం తెలియడంతో ఈ షోపై హైప్ పెరిగిపోయింది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా అక్టోబర్ 15 నుంచి ఈ షో డిజిటల్ స్ట్రీమింగ్ కానుంది. తాజాగా ది ట్రేటర్స్ ప్రోమోను మేకర్స్ రిలీజ్ చేశారు. మైండ్ గేమ్స్, వ్యూహాలు, సస్పెన్స్‌తో కూడిన ఈ రియాలిటీ షో మొత్తం 10 ఎపిసోడ్లుగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రతీ గురువారం ఒక కొత్త ఎపిసోడ్ ప్రసారమవుతుంది. ఇందులో పాల్గొనే పోటీదారులు ఫెయిత్‌ఫుల్స్, సీక్రెట్ ట్రేటర్స్ గా విడిపోయి సవాలుతో కూడిన టాస్కులు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఎవరు నమ్మకస్తులు, ఎవరు వెన్నుపోటు పొడిచే ద్రోహులు అనేది కనిపెట్టడమే ఈ షో ముఖ్య ఉద్దేశం. ఈ ప్రోమోలో కూడా గేమ్ ఎలా ఉంటుంది అనేది చెప్పుకొచ్చాడు. ఈ ప్రపంచంలో అందరూ మంచివారే.. మోసం చేసే అవకాశం రానంతవరకు అంటూ మొదలుపెట్టి ద్రోహులు ఉంటారు.. అందరిని మోసం చేసేవారు ఎలా గేమ్ ఆడతారు అనేది తెలియాలంటే ది ట్రేటర్స్ చూడాల్సిందే అని చెప్పుకొచ్చాడు. ఓటీటీ ప్రపంచంలోకి రియాలిటీ హోస్ట్‌గా అడుగుపెట్టడంపై తేజ సజ్జ ఎంతో ఉత్సాహం వ్యక్తం చేశారు. సినిమాలతో పాటు అన్‌స్క్రిప్టెడ్ షోల ద్వారా ప్రేక్షకులకు మరింత దగ్గరవ్వడానికి ఇది ఒక అద్భుతమైన అవకాశమని తెలిపారు. తేజ సజ్జకు ఉన్న సమయస్ఫూర్తి, చరిష్మా ఈ షోకి ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని, తెలుగు వెర్షన్ సరికొత్త మైలురాయిని క్రియేట్ చేస్తుందని ప్రైమ్ వీడియో ప్రతినిధులు ప్రశంసించారు. హిందీలో కరణ్ జోహార్ వ్యాఖ్యాతగా వచ్చి విశేష ఆదరణ పొందిన ఈ అంతర్జాతీయ ఫార్మాట్, ఇప్పుడు ఇంగ్లీష్ సబ్‌టైటిల్స్‌తో తెలుగులో కూడా అందుబాటులోకి వస్తోంది. విభిన్నమైన కాన్సెప్ట్‌తో రాబోతున్న ఈ థ్రిల్లింగ్ రియాలిటీ షో కోసం తెలుగు బుల్లితెర ఓటీటీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## Cinema




ఆది సాయికుమార్ శంబాల ఇచ్చిన హిట్ తో జోరు పెంచేశాడు. వరుస సినిమాలను లైన్లో పెట్టి షాక్ ఇస్తున్నాడు. ప్రస్తుతం ఆది హీరోగా నటించిన చిత్రం ఎస్ఐ యుగంధర్. రాఘవేంద్ర కటారి దర్శకత్వంలో రూపొందిన ఈ ఇన్వెస్టిగేటివ్ సస్పెన్స్ థ్రిల్లర్ లో ఆది సరసన మేఘలేఖ కథానాయికగా నటించింది. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్ , టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తాజాగా మూవీ అఫీషియల్ ట్రైలర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. తొలి ఫ్రేమ్ నుంచే ఉత్కంఠభరితమైన సన్నివేశాలతో సాగిన ఈ ట్రైలర్ సినీ ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటోంది. నగర శివార్లలో వరుసగా జరుగుతున్న ముగ్గురి దారుణ హత్యలతో ట్రైలర్ ప్రారంభమవుతుంది. ఈ సీరియల్ కిల్లర్ కేసును ఛేదించడానికి సబ్ ఇన్‌స్పెక్టర్ యుగంధర్‌గా ఆది సాయికుమార్ రంగంలోకి దిగుతాడు. కిల్లర్ తీవ్రమైన నార్సిసిస్టిక్ బిహేవియర్, గాడ్ కాంప్లెక్స్ మానసిక రుగ్మతతో బాధపడుతున్నాడని, అతను పోలీసులను తప్పుదోవ పట్టించడానికి పక్కా ప్రణాళికతో హత్యలు చేస్తాడని యుగంధర్ గుర్తిస్తాడు . డెడ్ బాడీలు 24 గంటల్లోనే మాయమవ్వడం, కేసు తీవ్రత పెరగడంతో ఉన్నతాధికారుల నుంచి తీవ్ర ఒత్తిడి ఎదురవుతుంది. సైకో కిల్లర్ సైకాలజీని అర్థం చేసుకుంటూ ఈ కేసును ఛేదించడానికి యుగంధర్ ఏం చేశాడు.. ? ఎందుకు సైకో కిల్లర్ మనుషులను చంపుతున్నాడు.. ? అనేది సినిమా చూసి తెలుసుకోవాల్సిందే. క్రైమ్ ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్స్ ఎప్పుడూ బోర్ కొట్టవు. అందులో సైకో కిల్లర్ వర్సెస్ పోలీస్ అంటే సీట్ ఎడ్జ్ లో కూర్చోపెడతాయి. ఈ సినిమా కూడా అలాగే ఉండబోతుందని ట్రైలర్ ని బట్టి తెలుస్తోంది. మార్కస్ ఎన్ అందించిన నేపథ్య సంగీతం థ్రిల్లింగ్ అనుభూతిని కలిగిస్తోంది. గ్రిప్పింగ్ స్క్రీన్‌ప్లే, యాక్షన్ ఎలిమెంట్స్, సస్పెన్స్‌తో కూడిన ఈ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌ను అక్టోబర్ 2న గాంధీ జయంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు చిత్రబృందం సిద్ధమైంది. ఎస్ఐ యుగంధర్ రూపంలో ఆది సాయికుమార్ మరో సాలిడ్ హిట్ ని అందుకుంటాడా .. ? లేదా.. ? అనేది తెలియాల్సి ఉంది.




OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085